ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 16 మార్చి 2024

శుక్రవారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 36.0°C | కనిష్టం : 23.5°C

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	శనివారం	సా : 6.32 గం..
సహర్ :	ఆదివారం	ఉ : 5.01 గం..



హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, చిత్రంలో మంత్రి కొండాసురేఖ తదితరులు



- కాంగ్రెస్ గూటికి వరంగల్ ఎంపీ దయాకర్!
- మంత్రి సురేఖతో కలిసి సీఎం వద్దకు.. నేడు చేరికకు ఏర్పాట్లు
- హస్తం కండువా కప్పుకొనేందుకు తాటికొండ రాజయ్య విఫలయత్నాలు
- ఇప్పటికే ప్రధాని మోదీ సమక్షంలో బీజేపీలో చేరేందుకు సిద్ధమైన అరూరి రమేష్
- వరంగల్ టికెట్ కోసం పట్టుపడుతున్న కమ్యూనిస్టులు
- సీపీఐ అగ్రనేతలతో కలిసి ఏఐసీసీ నేతలపై ఒత్తిడి
- లోక్‌సభ ఎన్నికల వేళ ఉత్కంఠ రేపుతున్న పరిణామాలు

రాజకీయం రసవత్తరం

ఓరుగల్లులో వేగంగా మారుతున్న సమీకరణాలు

(వరంగల్-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓరుగల్లు రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు.. అధికారం కోల్పోయిన తర్వాత జరుగుతున్న పరిణామాల్లో తలోదారి చూసుకుంటున్నారు. ఎవరికివారు కాంగ్రెస్ లేదంటే బీజేపీలో చేరేందుకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలవడంతో ఆయన కాంగ్రెస్ చేరబోతున్నారన్నది స్పష్టమైంది. ఇప్పటికే వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మోదీ సమక్షంలో బీజేపీలో చేరేందుకు సిద్ధమవయ్యారు. అలాగే మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య కూడా కారు దిగి.. హస్తం గూటికి చేరేందుకు నెలరోజులుగా ప్రయత్నాలు చేస్తున్న అవి ఫలించకపోతుండటంతో ఆయన మరోపార్టీ వైపు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇవన్నీ ఇలా ఉంటే వరంగల్ సీటుపై కన్నేసిన కామ్రేడ్లు.. పొత్తులో భాగంగా సీపీఐకి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద పట్టుబడుతున్నారు.

బీఆర్ఎస్‌కు ఝలక్ ఇచ్చిన పసునూరి

పార్లమెంట్ ఎన్నికల వేళ ఎంపీ పసునూరి దయాకర్ బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చారు. రెండు రోజులుగా జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖతో కలిసి పార్టీ మార్పుపై చర్చించిన ఆయన శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రి కొండా సురేఖతో కలిసి వెళ్లి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అయితే గతంలోనే రేవంత్ రెడ్డి, దయాకర్ ఎంపీలుగా కలిసి పనిచేయడంతో పాటు ఇద్దరూ కలిసి హైదరాబాద్ కళాశాలలో ఫైన్‌ఆర్ట్స్ కోర్సు చదివిన సాన్నిహిత్యం ఉంది. ఈ క్రమంలో పసునూరి తన రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. ఇక ఆయన శనివారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండం గులాబీ పార్టీకి భారీ కుదుపన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత బీఆర్ఎస్ నుంచి మరోసారి ఎంపీ టికెట్ ఆశించిన దయాకర్.. తనకు కాకుంటే కనీసం ఉద్యమకారులకైనా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. కానీ అధినాయకత్వం అనుహ్యంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు టికెట్ కేటాయించింది. దీంతో పార్టీలో మాదిగలకు అన్యాయం జరుగుతోందన్న అసంతృప్తికి గురైన దయాకర్ పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇప్పటికే అరూరి లాంటి కీలక నేతలు పార్టీని వీడుతున్న వేళ.. సిట్టింగ్ ఎంపీ దయాకర్ కూడా కారు దిగుతుండటం గులాబీ నేతల్లో గుబులురేపుతోంది. మరోవైపు తమకే బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చినా.. పార్టీ తమను కాదని మరో నిర్ణయం తీసుకుందని ఉద్యమకారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే చర్చ పార్టీలో జరుగుతోంది.



కమలం గూటికి అరూరి..

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పార్టీ మార్పు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. కొంతకాలంగా అరూరి బీజేపీలో చేరుతారనే ఊహాగానాలు వినిపించాయి. హైదరాబాద్‌లో అమిత్‌షాను కలిసి వచ్చిన అరూరి.. పార్టీ మారేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ నేతలు ఆయన్ను బలవంతంగా హైదరాబాద్‌కు తరలించారు. కేసీఆర్ సమక్షంలో పార్టీ మారనని చెప్పినా.. బీజేపీలో చేరేందుకు అరూరి వేగంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయన ముఖ్య అనుచరులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు బిజీగా ఉండటంతో రమేష్ చేరిక వాయిదా పడ్డట్లు సమాచారం. శుక్ర, శనివారాల్లో పీఎం నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనలు ఉండటంతో ఆయన సమక్షంలో శనివారం కమలదళంలో చేరే అవకాశాలున్నాయి.



వరంగల్ సీటు కోసం సీపీఐ పట్టు

కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా వరంగల్ సీటును తమకు కేటాయించాలని కమ్యూనిస్టులు పట్టుబడుతున్నారు. బుధవారం వరంగల్ ఎంపీ సీటు అభ్యర్థిగా సీపీఐ ప్రతిపాదిస్తున్న బీఆర్.లెనిన్‌తో పాటు వరంగల్ సీపీఐ నేత శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే కూనంనేని, చాడ వెంకటరెడ్డి, పార్థసారధి తదితర నేతలు ఢిల్లీకి వెళ్లారు. సీపీఐ అగ్రనేత డి.రాజాను కలిసి వరంగల్ ఎంపీ సీటు సీపీఐ కేటాయించేలా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో చర్చించాలని నిర్ణయించారు. పొత్తులో భాగంగా ఖమ్మం లేదా వరంగల్ సీట్లలో ఏదో ఒకటి ఇవ్వాలని గతంలో విజ్ఞప్తి చేశారు. అయితే ఖమ్మం సీటు విషయంలో కాంగ్రెస్ విముఖంగా ఉండటంతో వరంగల్ సీటును సాధించేందుకు కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. శనివారం ఏఐసీసీ అగ్రనేతలతో వరంగల్ సీటుపై తాడోపేడో తేల్చుకునేందుకు కమ్యూనిస్టులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ సీటు కోసం 50మందికి పైగా ఆశావాహులు ఉండగా, తాజాగా సిట్టింగ్ ఎంపీ దయాకర్ కూడా టికెట్‌పై ఆశతోనే పార్టీలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ వరంగల్ సీటుపై పట్టుబడుతుండటం వరంగల్ రాజకీయాల్లో రాజకీయ వేడి రగులుతోంది.



ఢిల్లీలో సీపీఐ జాతీయ కార్యదర్శి రాజాను కలిసిన బీఆర్ లెనిన్, సీపీఐ నేతలు

తాటికొండ దారెటు..?



బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించిన మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య దారెటనే చర్చ జరుగుతోంది. ఫిబ్రవరి 3వ తేదీన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన రాజయ్య.. అదేనెల 10వ తేదీన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు అప్పట్లో ప్రకటించారు. అయితే కాంగ్రెస్‌లో చేరేందుకు రాజయ్య చేస్తున్న ప్రయత్నాలకు గతంలో అయనపై వచ్చిన ఆరోపణలు అడ్డుపడుతున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షితో పాటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌తో పాటు కీలక నేతలను రాజయ్య కలిశారు. అయినా రాజయ్య చేరికకు అడ్డంకులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయంగా వెనుకబడే అవకాశాలుండటంతో త్వరితగతిన కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్నుత్న ఆయన అవి ఫలించకుంటే ఒకటి రెండు రోజుల్లో మరో పార్టీలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మరోపార్టీ నుంచి రాజయ్యకు ఆఫరు వచ్చినట్లుగా సమాచారం. లోక్‌సభ ఎన్నికల వేళ సీనియర్ నేత రాజయ్య రాజకీయ అడుగులు ఎటు వైపు అనే చర్చ జరుగుతోంది. మొత్తానికి శనివారం లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఓరుగల్లు రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి.

- అంతకంతకూ పెరుగుతున్న అన్వేష్ నకిలీ బిల్లుల బాగోతం
- కార్పొరేషన్‌లో ఫైళ్లను జల్లెడ పడుతున్న పోలీసులు
- విచారణలో వెలుగులోకి అనేక ఆసక్తికర అంశాలు



అన్వేష్

24 కాదు.. 62..

మట్టెవాడ(వరంగల్), మార్చి 15: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ బండా అన్వేష్ అవినీతి బాగోతం అంతకంతకూ పెరుగుతోంది. ఆయన చేసిన అక్రమాలపై విచారణ జరుపుతున్న మట్టెవాడ పోలీసులు ఫైళ్లను జల్లెడపడుతున్నారు. అనేక ఫైళ్లు, బిల్లులను పరిశీలిస్తే నకిలీ బిల్లుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆయన సృష్టించింది 24నకిలీ బిల్లులు కాదని, 62అని పోలీసుల విచారణలో తేలింది. ఇప్పటికే నకిలీ బిల్లులు సృష్టించి రూ.కోట్లు దండుకున్న కేసులో అన్వేష్ ప్రస్తుతం కండీషన్ బెయిల్‌పై ప్రతీ ఆదివారం మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో హాజరవుతున్నారు. ఈ ఫోర్జరీ కేసులో అన్వేష్‌తోపాటు అప్పటి అకౌంటెంట్ ఉమాకాంత్ మరో సీనియర్ ఆడిటర్ సతీష్‌ను అక్టోబరులో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. వారు బెయిల్‌పై బయటకొచ్చారు. కేసు విచారణలో పోలీసులు అన్వేష్ అక్రమాలు, నకిలీ బిల్లుల తయారీపై మట్టెవాడ పోలీసులు క్షుణ్ణంగా విచారణ చేయడంతో రోజురోజుకూ నకిలీ బిల్లుల సంఖ్యతోపాటు అక్రమంగా నకిలీ బిల్లుల ద్వారా డబ్బులు దండుకున్న మొత్తం కూడా పెరుగుతూ వస్తోంది. 2015 నుంచి అన్వేష్ తయారీ చేసిన నకిలీ బిల్లులు వాటికి సంబంధించిన ఫైళ్లను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

ఫోర్జరీతో కొల్లగొట్టింది రూ.2.32కోట్లు కాదు.. రూ.4.50కోట్లు?

గత అక్టోబరు నుంచి నకిలీ బిల్లులపై విచారణ జరుగుతుండగా ఇటీవల పోలీసులు కార్పొరేషన్ అధికారుల నుంచి కొన్ని ఫైళ్లను తెప్పించుకొని పరిశీలిస్తే మరికొన్ని బిల్లులు బయటపడ్డాయి. అక్టోబరులో 24 నకిలీ బిల్లులు రూ.2.32కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి అన్వేష్‌తోపాటు అప్పటి అకౌంటెంట్ ఉమాకాంత్, ఆడిటర్ సతీష్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. పోలీసుల విచారణలో నకిలీ బిల్లుల సంఖ్య 24 నుంచి ఇప్పుడు 62కు చేరింది. రూ.2.32 కోట్ల నుంచి ఇప్పుడు రూ.4.50కోట్ల వరకు నకిలీ బిల్లుల ద్వారా డబ్బులు డ్రా చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. తవ్విన కొద్ది ఈ నకిలీ బిల్లుల వ్యవహారం బయటకు వస్తోంది. 2017 నుంచి 2022 వరకు అన్వేష్ 62 నకిలీ బిల్లులను తయారు చేసి రూ.4.50 కోట్ల వరకు ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చారు. అయితే గతంలో ఇక్కడ పనిచేసిన అకౌంటెంట్ ప్రీ ఆడిట్ విభాగంలోని ఓ ఉద్యోగితో పాటు అన్వేష్ పక్కా ప్రణాళికతో 62 నకిలీ బిల్లులను తయారు చేసి రూ.4.50 కోట్లు దండుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇక అన్వేష్ చేతిరాత కోసం పోలీసులు కమిషనర్‌కు ఇటీవల లేఖను రాయగా.. ఈనెల 23 లోపు అన్వేష్ తన సంతకాలను పోలీసులకు అందజేయాల్సి ఉంటుంది.

ఆస్తుల రికవరీపై పోలీసుల దృష్టి..

కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ బండా అన్వేష్ ఆస్తులను జప్తు చేసుకోవడం కోసం పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రూ.కోటి విలువ చేసే న్యూ శాయంపేటలోని వేయి గజాల భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేశారు. నగరంలోని ఒక ప్రైవేటు చిట్‌ఫండ్‌లో రూ.25లక్షల చిట్టి, అక్కడి రూ.35లక్షల ఎఫ్‌డీని సీజ్ చేసినట్లు తెలిసింది. అదే విధంగా ఈ కేసులో మరో నిందితుడు ఉమాకాంత్‌కు సంబంధించిన భువనగిరి యాదగిరి జిల్లాలో ల్యాండ్ డాక్యుమెంట్లను పోలీసులు సీజ్ చేసినట్లు తెలిసింది. దీని విలువ రూ. 30లక్షలు. ఉంటుందని తెలుస్తోంది. అన్వేష్ పోలీసులకు పూర్తిస్థాయిలో విచారణకు సహకరించకుంటే బెయిల్ రద్దు కోసం పోలీసులు న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో నకిలీ బిల్లుల పేరుతో డబ్బులు డ్రా చేసిన బిల్లుల సంఖ్యతోపాటు రూ.4.50కోట్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం కావడంతో పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు.

‘అక్రమాల పర్వం’పై

కలెక్టర్ ఆరా

- రిజిస్ట్రేషన్ శాఖ కార్యకలాపాలపై దృష్టి
- కార్యాలయ సిబ్బందితో జిల్లా రిజిస్ట్రార్ సమావేశం
- చర్చనీయాంశమైన ‘ఆంధ్రజ్యోతి’ కథనం

రాంనగర్, మార్చి 15: ‘రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాల పర్వం’ అనే కథనం శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కాగా, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆరా తీసినట్లు తెలిసింది. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అసలు ఏం జరుగుతోంది..? ఎందుకు ఇన్ని కథనాలు వస్తున్నాయి? అని సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరినట్లు తెలిసింది. ప్రధానంగా ‘ఆంధ్రజ్యోతి’ కథనాన్ని ప్రస్తావిస్తూ అధికారులను వివరణ కోరినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల మేరకు కార్యకలాపాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించినట్లు తెలిసింది. పొరపాట్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు అధికారిక సమాచారం.

సిబ్బందితో రిజిస్ట్రార్ సమావేశం

జిల్లా రిజిస్ట్రార్ రవి కార్యాలయానికి వచ్చిన వెంటనే సిబ్బందితో భేటీ అయ్యారు. ‘ఆంధ్రజ్యోతి’లో వచ్చిన కథనంపై చర్చించినట్లు తెలిసింది. డిపార్ట్‌మెంట్ వాట్సాప్ గ్రూపుల్లో ‘ఆంధ్రజ్యోతి’ కథనాన్ని పోస్టు చేసి సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు సమాచారం. స్లాట్ బుక్ చేసుకున్న వారి రిజిస్ట్రేషన్‌లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, వీలుంటే నాన్ స్లాట్ రిజిస్ట్రేషన్‌లు చేయాలని వాట్సాప్ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కార్యాలయాల సబ్ రిజిస్ట్రార్‌లకు సూచించినట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్‌ల కోసం కార్యాలయానికి వచ్చే క్రయ విక్రయదారులకు నిబంధనలు తెలపాలని రిజిస్ట్రార్ పేర్కొన్నట్లు సమాచారం. నిబంధనలు విస్మరిస్తే చర్యలు తప్పవని రిజిస్ట్రార్ రవి హెచ్చరించినట్లు తెలిసింది. మొత్తంగా ‘ఆంధ్రజ్యోతి’ కథనం రిజిస్ట్రేషన్ శాఖలో ప్రకంపనలు సృష్టించింది.



కోర్టు ప్రాంగణంలో పనులపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

నేడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

ఏసీబీ కోర్టు ప్రారంభానికి సిద్ధం

వరంగల్ లీగల్/వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే శనివారం జిల్లాకు రానున్నారు. జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు కార్యాలయం శుక్రవారం ప్రకటన జారీచేసింది. జిల్లా కోర్టు ప్రాంగణానికి సాయంత్రం 4 గంటలకు చేరుకోనున్న జస్టిస్ ఆలోక్ అరాధే.. అవినీతి నిరోధక ప్రత్యేక కోర్టు (ఏసీబీ)ను ప్రారంభిస్తారు. అనంతరం హనుమకొండ సీనియర్ సివిల్ జడ్జి కోర్టును, ఇ-సేవా కేంద్రాన్ని, డిజిటలైజేషన్ విభాగాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రధాన న్యాయమూర్తితోపాటు జిల్లా ఫోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్, హైకోర్టు జడ్జిలు జస్టిస్ టి.వినోద్ కుమార్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు.

బల్దియా ఏర్పాట్లు

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిక్ కె. లక్ష్మణ్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు పర్యటన సందర్భంగా సుబేదారిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయస్థానంలో పలు ఏర్పాట్ల కార్యక్రమాలకు బల్దియా అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్ కోర్టు జడ్జి రమాదేవితో కలిసి శుక్రవారం సాయంత్రం కోర్టు ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులను పిలిచి పలు సూచనలు చేశారు. కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక, ఫ్లోరింగ్, డెకరేషన్, లైటింగ్‌తోపాటు ప్రారంభోత్సవాలు జరిగే ప్రాంతాల్లో రెడ్‌కార్పెట్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా కోర్టు ఆవరణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని శానిటేషన్ అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్‌కుమార్, ఏఈ సరితలు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు కొమ్మాల నరసింహుడు

రేపటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు


21న కల్యాణోత్సవం

జాతరకు లక్షలాది మంది భక్తుల రాక

గీసుగొండ, మార్చి 15: మహిమ గల కొమ్మాల శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి పక్షం రోజులపాటు వైభవంగా జరగనున్నాయి. వరంగల్ నగరానికి 15కి.మీ దూరంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిలో ఉన్న కొమ్మాల సమీపంలో సుందరంగా ఆలయం ప్రధాన ద్వారం భక్తులకు దర్శనమిస్తోంది. 50అడుగులు గల రాతి గుట్టపై వందల ఏళ్ల క్రితం లక్ష్మీనరసింహుడు స్వయంగా వెలియడంతో దీనిని స్వయంభూ దేవాలయంగా చెబుతుంటారు. స్వామి వారిని పాండవులు ఇలవేల్పుగా కొలిచినట్లు స్థల పురాణంలో ఉందని తెలిపారు. కాకతీయ రాజ్యాన్ని పాలించిన రుద్రమదేవి కూడా స్వామి వారి కల్యాణోత్సవానికి వచ్చేదని ప్రచారం. గుట్టకు సమీపంలోనే పాండవులు సంచరించినట్లు ప్రచారంలో ఉన్న చిన్న గుట్ట ఇప్పటికి ఉంది. మహిమ గల స్వామిని దర్శించుకునేందుకు సూదూర ప్రాంతాల నుంచిభక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకొని తరిస్తారు. ఆలయ ప్రాంగణంలో తూర్పు వైపున వెంకటగిరి అనే భక్తుడు రూ.80లక్షల విరాళాలతో నిర్మించిన రాజగోపురం స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక శోభనిస్తుంది. ప్రతియేటా బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి 2లక్షలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఆకట్టుకుంటున్న ఏళ్ల నాటి రథం

సుమారు 500 ఏళ్ల నాటి రాతి చక్రాలతో నిర్మించిన 5అంతస్తుల రథం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయ ప్రాంగణంలో రథాన్ని నిలిపేందుకు ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. ఈ రథంపైనే ఉత్సవమూర్తులను అశ్వ, హనుమ, సింహ, ఏనుగు, శేష వాహనాలపై కూర్చొబెట్టి ఆలయగుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఈ జాతరకు మైదాన ప్రాంత గిరిజనులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఆలయానికి దేవుడి మాన్యాల కింద 10 ఎకరాలు భూమి ఉంది. విశ్వనాథపురం గ్రామ పంచాయతీ శివారులో వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారి పక్కన ఈ భూములు ఉన్నాయి.



పర్యాటకంగా తీర్చిదిద్దాలి..

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి గుట్ట వరకు సెంట్రల్ లైటింగ్‌తో డివైడర్‌లను ఏర్పాటు చేసి రోడ్డును విస్తరించాలంటున్నారు. నాచినపెల్లి నుంచి ఆలయం వరకు బీటీ రోడ్డుతో పాటుఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మిస్తే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. వరంగల్ నగరానికి 15 కి.మీ దూరంలో ఉన్న ఆలయాన్ని అభివృద్ధి పరిస్తే టూరిజం కేంద్రంగా మారుతుందని స్థానికులంటున్నారు. కాగా, ఈ సంవత్సరం రూ.60 లక్షలతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఈనెల 17నుంచి 31వ తేదీ వరకు కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శేషగిరి, ఆలయ ట్రస్టీ చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. 17న అధ్యయనోత్సవం, 18న బిందెతీర్థం, ప్రాబోదకి, 19న నిత్యవిధి, పరమపదోత్సవం, 20న అంకురారోపణం, అగ్ని ప్రతిష్ఠ, 21న ధ్వజారోహణం, రాత్రి 10 గంటలకు కల్యాణోత్సవం, 22న హనుమత్‌సేవ, వాహనసేవ, 23న నిత్యహోమం, సింహవాహన సేవ, 24న గరుడవాహన సేవ, 25న శకటయానోత్సవం, జాతర(ఆలయ గుట్టచుట్టూ బండ్లు తిరుగుట), 26, 27, 28న మొక్కుబడులు, సేవలు, అర్చనలు, 29న రథోత్సవం, 30న పారువేట, పుష్పయాగం, నాగవెల్లి, 31న శతఘటాభిషేకం, పండిత సన్మానాలు ఉంటాయనా పేర్కొన్నారు.

అలసిన ‘ప్రజాపాలన’

దరఖాస్తులు తీసుకునేందుకు అధికారులు లేకపోవడంతో అసహనం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: ప్రజాపాలన అలిసిపోయింది. సరైన సమయానికి అధికారులు రావపోవడం.. వచ్చిన వారు కూడా సరిగా స్పందించకపోవడంతో ప్రజలు నీరుగారిపోతున్నారు. అధికారులు, సిబ్బంది కోసం నేలపై కూర్చుని కాపుకాశారు. మున్సిపల్ అధికారుల తీరుపై కొందరు మహిళలు అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించని వారికి మరికొన్ని రోజులు దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం కల్పించారు. అలాగే గతంలో సమర్పించిన దరఖాస్తులలో తప్పులు దొర్లడం గుర్తించిన అధికారులు.. ప్రజలకు మరొక్కమారు అవకాశం కల్పించారు. ఇది తెలుసుకున్న గ్రేటర్ వరంగల్ ప్రజలు.. బల్దియా కార్యాలయానికి పరుగులు పెట్టారు. ప్రతీరోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యాలయం ఏర్పాటు చేశారు. అంతే కాకుండా కాశిబుగ్గ, కాజీపేటతోపాటు 12 సెంటర్లలో ప్రజాపాలన దరఖాస్తులు ముట్టజెప్పేందుకు ప్రజలు పోటెత్తారు. 200 యూనిట్ల కరెంటు మాఫీ, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం గతంలో దొర్లిన తప్పులు సవరించుకునేందుకు ప్రజలు పిల్లాపాపలతో కలిసి వచ్చారు. శుక్రవారం ఒక్క రోజే అన్ని కేంద్రాలలో సుమారు 2వేల వరకు దరఖాస్తులు వచ్చినట్టు గ్రేటర్ వరంగల్ అధికారులు వెల్లడించారు. కాగా, శుక్రవారం దరఖాస్తులు ముట్టజెప్పేందుకు ప్రజలు ఒక్కసారిగా పెద్దఎత్తున గ్రేటర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్దకు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ప్రజలను కట్టడి చేసేందుకు అక్కడ ఎవరూ లేకపోవడంతో బల్దియా అధికారులకు మహిళలు శాపనార్థాలు పెట్టారు.



అధికారులు లేకపోవడంతో నేలపై కూర్చున్న మహిళలు

శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

సీపీకి ఫిర్యాదు చేసిన వినయభాస్కర్



సీపీకి ఫిర్యాదు చేస్తున్న వినయభాస్కర్ తదితరులు

రాంనగర్, మార్చి 15: బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వినయభాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ తదితరులతో కలిసి సీపీని కలిశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత ప్రభుత్వం వేసిన శిలాఫలకం, ఇటీవల వడ్డెపల్లి ముదిరాజ్‌వాడలో శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై కొందరు కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిపై చర్య తీసుకోవాలని వినయభాస్కర్ పోలీస్ కమిషనర్‌ను కోరారు.



అదనపు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన కార్యవర్గం

బల్దియా ఔట్‌సోర్సింగ్
డ్రైవర్ల సంఘం ఎన్నిక


వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు శుక్రవారం బల్దియా కార్యాలయం ఆవరణలో జరిగాయి. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్ పర్యవేక్షణలో ఈఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మేకల దేవేందర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నాగుల శ్రీకాంత్, కోశాధికారిగా దొడ్డిపాటి రాజేందర్, ఉపాధ్యక్షులుగా కొత్తపెల్లి కుమార్, కేతిరి పైడయ్య, కార్యదర్శిగా ఉసిల్ల ఆనందరావు, ప్రచార కార్యదర్శిగా పైనాల క్రాంతికుమార్, గుంజ రవి ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎన్నికల పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ప్రమాణం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు మున్సిపల్ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వార నూతన కమిటీని అభినందించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం రవియాదవ్, ఐలయ్య, భైరబోయిన గట్టయ్య అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

ఈనెల 22న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

మన ఘన చరిత్రను ముందు తరాలకి తెలియచేద్దాం
HISTORY IS BEING REWRITTEN నేడే చూడండి



సంధ్య 70 ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

రాజధాని 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
అర్జున్ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,2.15

BHUVANESHWARI PICTURES

విజయవంతమైన 2వ వారం



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

GLOBAL CINEMAS LLP

విజయవంతమైన 2వ వారం



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.15,6.00,9.15

నేడే చూడండి
SAI RAM SHANKAR'S
BEST MUSICAL COMEDY AND FAMILY ENTERTAINER



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00
మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట 11.15,2.30
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 2.05pm
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి 7.50pm
పివిఆర్ గలేరియా - పంజాగుట్ట 11.00am
పివిఆర్ పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 2.05pm
పివిఆర్ ఎస్2 సోమ - మల్లాపూర్ 1.30pm
INOX జీవీకే - మదీనగూడ 1.40pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.25am
సినీపోలిస్ డీఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 10.50am
మిరాజ్ సినిమాస్ - చందానగర్ 5.15pm
ఏషియన్ సినిమార్ట్ - ఆర్.సి.పురం 10.30am
ఎంజేఆర్ సినీప్లెక్స్ - నారపల్లి 10.50am
జీపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.45pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.45pm

SRI VIJAYA FILMS

SUPER HIT నేడే చూడండి



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 6.00,9.00

SUPER HIT నేడే చూడండి



ఆర్టి 70ఎంఎం ఎ/సి - సంఘీనగర్ 11.00,2.00,6.00,9.00
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి 5.00pm
పివిఆర్ ఐకాన్ - హైటెక్‌సిటీ 10.50pm
పివిఆర్ పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 4.20pm
పివిఆర్ ఎస్2 సోమ - మల్లాపూర్ 4.50pm
INOX జీవీకే - మదీనగూడ 11.20am
ఏషియన్ సినిమార్ట్ - ఆర్.సి.పురం 4.30pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.25pm
మిరాజ్ సినిమాస్ - చందానగర్ 8.15pm
జీపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 4.30pm
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 6.00,9.00

NAVODAYA PICTURES 9505093322, 9848028739



కొత్తపల్లిలో బావిలో నుంచి పునుగు పిల్లిని బయటకు తీస్తున్న అటవీ శాఖ అధికారులు

కొత్తపల్లిలో బావిలో పడిన అరుదైన పిల్లి

భీమదేవరపల్లి, మార్చి 15: భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నిమ్మ రాజిరెడ్డి అనే రైతు వ్యవసాయ బావిలో అరుదైన పిల్లి పడింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన రేణుకుంట్ల రాజు, గ్రామస్థులతో పాటు హనుమకొండ అటవీశాఖ అధికారులకు తెలియజేశాడు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం అటవీశాఖ అధికారులు, అటవీ శాఖ రిస్క్ టీమ్ బృందం స్పందించి బావిలో దిగి అరుదైన పిల్లిని బంధించారు. అనంతరం హనుమకొండ జూపార్క్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంగా ఉన్నట్లయితే తిరుపతి జూపార్క్‌కు తరలిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ పిల్లిని పునుగు పిల్లిగా భావిస్తున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తిరుమల తిరుపతి అడవుల్లో ఎక్కువగా ఈ పునుగు పిల్లిలు సంచరిస్తాయని తెలిపారు.

అమ్మవారిపేట చెరువుకు
రామ్‌సర్ సైట్ హోదా

ఆ దిశగా పడుతున్న అడుగులు.. మొదలైన ప్రయత్నాలు

త్వరలో సందర్శించనున్న జీవవైవిధ్య నిపుణుల బృందం

రామ్‌సర్ సైట్ హోదాతో చెరువుకు అంతర్జాతీయ గుర్తింపు

హనుమకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అనేక అరుదైన పక్షులకు ఆవాసమైన వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట చెరువుకు త్వరలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రామ్‌సర్ సైట్ హోదా లభించనున్నది. ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా రామ్‌సర్ సైట్ జీవవైవిధ్య నిపుణుల బృందం అమ్మవారిపేట చెరువును సందర్శించేందుకు రానున్నది. కొద్ది రోజుల కిందటే ఈ బృందం రావలిసి ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల సందర్శన వాయిదా పడింది.

150కిపైగా పక్షులు

అమ్మవారిపేట చెరువు, దాని పరిసర ప్రాంతాల్లో అత్యంత అరుదైన, అంతరించిపోతున్న జాతులకు చెందిన, అలాగే పలు ఇతర దేశాలకు చెందిన 150 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. వీటిలో 50 శాతం పక్షులు ఇతర దేశాల నుంచి వలస వచ్చిన పక్షులే. అన్ని రకాల పక్షులు ఒక చెరువును ఆవాసంగా చేసుకొని ఉండడం అరుదు. ఆ ఘనత అమ్మవారిపేట చెరువుకు దక్కుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి జీవవైవిధ్యం కలిగిన చెరువు లేదు. ఒకప్పుడు పాకాల సరస్సుకు ఈ ప్రత్యేకత ఉండేది. కానీ ఇప్పుడు అక్కడ అంతగా లేదు. అమ్మవారిపేట చెరువుకు వలస పక్షులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం ఇటీవల కాలంలో పెరిగింది. ఇందుకు అనువైన వాతావరణం ఉండడం ఒక కారణం.

నిపుణుల బృందం రాక

అమ్మవారిపేట చెరువు విశిష్టతను గుర్తించిన రామ్‌సర్‌సైట్ దీనిపై దృష్టి సారించింది. పలువురు పక్షి ప్రేమికులు, వణ్యప్రాణుల అభిమానులు చెరువు విశిష్టతను తెలియచేసే ఛాయాచిత్రాలతో డాక్యుమెంటేషన్ చేశారు. సమగ్ర సమాచారంతో నివేదికను రూపొందించారు. ఈ రెండింటిని రామ్‌సర్‌సైట్‌కు పంపించారు. వీటిని పరిశీలించిన ఈ సంస్థ చెరువు, దానిని అవాసంగా చేసుకున్న వివిధ రకాల పక్షులు, పరిసరాలు తదితర అంశాలను అధ్యయనం చేయడానికి ఒక నిపుణుల బృందాన్ని పంపాలని నిర్ణయించుకున్నది. నల్లగొండ జిల్లాకు చెందిన గుజ్జ బిక్షం ఈ బందంలో సభ్యులుగా ఉన్నారు. ఆయన చొరవతోనే అమ్మవారిపేట చెరువు రాంసర్ సైట్ జాబితాలో చేర్చే ప్రతిపాదన పరిశీలనకు వచ్చినట్టు సమాచారం.

రామ్‌సర్ సైట్ అంటే ఏమిటీ?

రామ్‌సర్ సైట్ అనేది చిత్తడి నేలల పరిరక్షణకు సంబంధించి అంతర్జాతీయ సహకారాన్ని అందించే ఒక వ్యవస్థ. ది కన్వెన్షన్ ఆఫ్ వెట్ ల్యాండ్స్ అని కూడా దీనిని పిలుస్తారు. యునెస్కో ఆధ్వర్యంలో ఇరాన్‌లోని రామ్‌సర్‌లో 1971 ఫిబ్రవరి 2న నిర్వహించిన ఒక సదస్సులో చిత్తడి నేలల సంరక్షణకు అంతర్జాతీయ సహకారాన్ని అందించేందుకు అంగీకరిస్తూ వివిధ దేశాలు సంతకాలు చేసిన ఒక ఒప్పందం. రామ్‌సర్‌లో ఈ ఒప్పందం కుదిరినందు వల్ల దీనికి రామ్‌సర్ సైట్ కన్వెన్షన్ అని కూడా పిలుస్తారు. రామ్‌సర్ సైట్ అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన చిత్తడి నేలలను గుర్తించడమే కాకుండా ప్రధానంగా నీటి పక్షుల (వాటర్ బర్డ్స్) ఆవాసాలను పరిరక్షించేందుకు తోడ్పాటును అందిస్తుంది. రామ్‌సర్ సైట్ ఏదైనా పక్షుల ఆవాసాన్ని గుర్తిస్తే దానికి రామ్‌సర్ సైట్ అని పేరుపెడతారు. ప్రపంచ వ్యాప్తంగా 2500 రామ్‌సర్ సైట్‌లు ఉన్నాయి. భారతదేశంలో 82 వరకు గుర్తించారు. ఏపిలో కొల్లేరు సరస్సుకు ఈ హోదా దక్కింది. తెలంగాణలో ఇప్పటి వరకు ఏ ఆవాసానికి ఈ గుర్తింపు రాలేదు. అమ్మవారిపేట చెరువుకు దక్కితే తెలంగాణలో రామ్‌సర్‌సైట్‌గా గుర్తింపు పొందిన మొదటి ఆవాసం ఇదే అవుతుంది. రామ్‌సర్‌సైట్‌గా గుర్తించడానికి తొమ్మిది అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో ఏ ఒక్క ప్రమాణం పరిధిలోకి పక్షుల ఆవాసం వచ్చినా దానికి రామ్‌సర్ సైట్ గుర్తింపు వస్తుంది. అరుదైన లేదా ప్రత్యేకమైన చిత్తడినేల కలిగి ఉండడం, అంతరించిపోతున్న లేదా తీవ్రంగా అంతరించిపోతున్న పక్షి జాతులు కలిగిన ప్రాంతమై ఉండడం, నిర్దిష్టమైన జీవభౌగోళిక ప్రాంతమై అందులో జీవవైవిధ్యం కలిగిన మొక్క లేదా జంతు జాలం ఉండడం, పక్షులు, జంతుజాలాలు జీవిత చక్రాలలో క్లిష్టమైన దశను, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఉండడం, ఒకే ప్రాంతంలో 20వేలు అంతకన్నా ఎక్కువ నీటి పక్షులు కలిగిన అవాసమై ఉండడం, ప్రపంచ జీవవైవిధ్యానికి దోహదపడే ప్రాంతమై ఉండడం, వలసమార్గంలో పక్షులకు అనువైనా ఆవాసంగా ఉండడం, చిత్తడి నేలపై ఆధారపడిన నాన్ ఏవియన్ జంతు జాతుల జనాభలో కనీసం ఒక శాతమైన పరిక్షించే అవకాశం కలిగి ఉండడం ఈ ప్రమాణాల్లో ఉన్నాయి. రామ్‌సర్ సైట్‌లో గుర్తించే పక్షుల ఆవాస ప్రాంతాలను మూడు రకాలుగా వర్గీకరించారు. ఒకటి సముద్ర తీర చిత్తడి నేలలు, రెండవది లోతట్టు చిత్తడి నేలలు, మూడవది మానవ నిర్మిత చిత్తడి నేలలు. ఈ మూడవ కేటగిరి కిందికి అమ్మవారిపేట చెరువు వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు సరస్సునను 2002 ఆగస్టు 19న రామ్‌సర్‌సైట్ జాబితాలో చేరింది.

భారీగా నిధులు

రామ్‌సర్ సైట్ జాబితాలోకి అమ్మవారిపేట చెరువు చేరిన పక్షంలో చెరువు, దానిని ఆవాసంగా చేసుకొని జీవిస్తున్న జంతుజాలాలు, ముఖ్యంగా నీటి పక్షుల సంరక్షణకు భారీగా నిధులు అందుతాయి. రామ్‌సర్ కన్వెన్షన్ బర్డ్‌లైఫ్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేటచర్ (ఐయూసీఎన్) అనే ఈ సంస్థకు వెట్‌ల్యాండ్స్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యుఎంఐ), డబ్లుడబ్ల్యుఎఫ్ ఇంటర్నేషనల్, వైల్డ్‌పౌల్, వెట్ ల్యాండ్స్ ట్రస్ట్ (డబ్ల్యుడబ్ల్యుటీ) వంటి ఏజెన్సీల భాగస్వామ్యంతో పని చేస్తుంది. అమ్మవారిపేట చెరువు ఒక సారి ఈ సైట్‌హోదా లభిస్తే ఆ మొత్తం ప్రాంతం రామ్‌సర్ తన ఆధీనంలోకి తీసుకుంటుంది. నీటి పక్షులు సంరక్షణ ప్రాంతంగా ప్రకటిస్తుంది. ఆ ప్రాంతాన్నంతా పక్షులకు మరింత అనుకూలమైన ఆవాసంగా తీర్చిదిద్దుతుంది. పక్షలు వేటను నిషేధిస్తుంది. మానవ సంచారాన్ని పరిమితం చేస్తుంది. చుట్టు పక్కల క్వారీలను నిషేధిస్తుంది. చిత్తడినేల స్వభావాన్ని సంరక్షిస్తుంది. చెరువు, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో నిర్మాణాలు, తవ్వకాలను కూడా నిసేధిస్తుంది. చెరువు సంరక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తుంది. జీవవైవిధ్య నిపుణుల పర్యవేక్షణ, అధ్యయనం, పక్షలు వలసలు, అరుధైన పక్షుల రాక, గుర్తింపు నిరంతర ప్రక్రియగా ఉంటుంది.

విద్యకు వెలుగు



- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్
- సర్కారు చదువులకు చేయూత
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,689 విద్యాలయాలకు ఉచిత విద్యుత్
- డిజిటల్ విద్య, పాఠశాల నిర్వహణకు ఊతం
- సర్వీస్ పర్సన్ల నియామకంతో బడుల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 15: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఇక నుంచి జీవో విద్యుత్ బిల్లులే రానున్నాయి. ఆదివారం నాడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమిస్తామని చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు కలిపి మొత్తం 3,689 విద్యాసంస్థలు ఇకపై విద్యుత్‌బిల్లులు చెల్లించాల్సిన పనిలేదు. విద్యుత్ బిల్లు కోసం ఇంతకు ముందు వినియోగించుకున్న పాఠశాల నిర్వహణ నిధులు ఇతర అవసరాలకు మళ్లించుకొనే అవకాశం లభించినట్లయ్యింది. ఇక కరోనా తర్వాత పాఠశాలల్లో పారిశుధ్యం పడకేసింది. పాఠశాలల్లో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సిబ్బంది లేకపోవడంతో దుర్భరమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రభుత్వం డిజిటల్ విద్య ప్రవేశపెట్టిన నేపథ్యంలో బడులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తే డిజిటల్ విద్యకు ఊతమివ్వడమే కాకుండా పాఠశాల నిర్వహణ డిజిటల్ విధానంలో మరింత సులువయ్యే అవకాశం పెరుగుతుంది.

డిజిటల్ విద్య, పాఠశాల నిర్వహణకు ఊతం

పాఠశాలల్లో ఉచిత విద్యుత్ సౌకర్యంతో ఇప్పటికే పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ విద్యకు ఊతమిచ్చినట్లు అవుతోంది. విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమయ్యేందుకు గత ప్రభుత్వం ఐఎఫ్‌బీ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసింది. అంతకు ముందు కొన్ని పాఠశాలల్లో ప్రొజెక్టర్ డిజిటల్ విద్యాబోధన పరికరాలను ఏర్పాటు చేసింది. అయితే పాఠశాలల్లో వీటి వాడకాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్ధేశిత సమయాల్లో మాత్రమే ఉపయోగిస్తున్నారు. పాఠశాల నిర్వహణ నిధులు రాక, కరెంట్ బిల్లులు చెల్లించలేక కొన్నిచోట్ల డిజిటల్ విద్యకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇక నుంచి ప్రభుత్వం అందించనున్న ఉచిత విద్యుత్ సౌకర్యంతో పాఠశాలల్లో నిరంతరంగా డిజిటల్ పాఠ్యాంశాలు కొనసాగనున్నాయి. కరోనా అనంతరం పాఠశాల నిర్వహణ డిజిటలైజేషన్ అయ్యింది. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, మధ్యాహ్న భోజన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారానే పంపిస్తున్నారు. ఇక ముందు నుంచి ఎలాంటి అవాంతరాలు లేకుండా పాఠశాల నిర్వహణ పనులు చేసుకోవచ్చును.

పాఠశాలల్లో మెరుగుపడనున్న పారిశుధ్యం

పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమిస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనతో పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుపడనున్నది. కరోనా అనంతరం పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లు కరువైనారు. దీంతో పాఠశాలల్లో పారిశుధ్యం పడకేసింది. కొన్ని పాఠశాలలకు వచ్చే నిర్వహణ నిధులు (కాంటింజెంట్ బిల్లుల)తోనే ప్రైవేటు వ్యక్తులకు నియమించుకొని తాత్కాలింగా పాఠశాలల ఆవరణలను శుభ్రం చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు లేరు. అక్కడక్కడ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చొరవతో మాత్రమే కాంటింజెంటి వర్కర్లు పని చేస్తున్నారు. గత ప్రభుత్వం సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామపంచాయితీల సిబ్బందితో పాఠశాలలను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ అది సాధ్యం కాలేదు. దాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించి పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులను మెరుగు పరిచేందుకు పూనుకుంది.

ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు

సమావేశంలో ముఖ్యమంత్రి మరో కీలక ప్రకటన చేశారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అరకొర వసతులతో నడుస్తోన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇక నుంచి పూర్తి స్థాయిలో వసతులు సమకూరనున్నాయి. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన పూర్తి స్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో అవసరమైన వసతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామని వారు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రస్తుత వరంగల్ జిల్లాలో 740 పాఠశాలలకు ఉచిత విద్యుత్ సదుపాయం అందనుంది. హనుమకొండ జిల్లాలో 535, మహబూబాబాద్ జిల్లాలో 898, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 432, జనగామ జిల్లాలో 473, ములుగు జిల్లాలో 453 పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనుంది. వీటితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల్లో, 16 మైనారిటీ గురుకులాల్లో, 22 ఎస్సీ, 36 ఎస్టీ గురుకులాలతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 49 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సైతం ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించనుంది.

జిల్లా	ప్రైమరీ	యూపీఎస్	హైస్కూల్స్	జూ.కళాశాలలు
వరంగల్	493	87	160	11
హనుమకొండ	318	72	145	9
మహబూబాబాద్	676	120	102	10
భూపాలపల్లి	319	44	69	5
జనగామ	297	64	113	7
ములుగు	366	46	41	7

రుద్రమ దశాబ్ది వార్షిక సమావేశాలు

- రేపు ఐదు గ్రంథాల అవిష్కరణ
- ఘనంగా జరగనున్న సాహిత్య సభలు

హనుమకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రుద్రమ వార్షిక సమావేశాలు ఆదివారం హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతాయని ప్రముఖ కవియిత్రులు, రచయిత్రులు అనిశెట్టి రజిత, కొమ్మరాజు రామలక్ష్మిలు తెలిపారు. ఈ సందర్భంగా రుద్రమ ప్రచురణలకు చెందిన ఐదు గ్రంథాల ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. గ్రంథావిష్కర్తలుగా కథా, నవలా రచయితలు అంపశయ్య నవీన్, బీవీఎన్ స్వామి, తిరునగరి దేవకీదేవి, వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావులు ఈ సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. గ్రంథ పరిచయకర్తలుగా మెట్టు రవీందర్, తెన్నేటి విజయ చంద్ర, సింగరాజు రమాదేవి, జి.చంద్రకళ, పి.మాలతీ పాల్గొంటారని తెలిపారు. సౌహార్ద సందేశకులుగా నాగిళ్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, పి.చంద్, శ్రీ రంగ స్వామి, వల్లంపట్ల, పల్లేరు వీరస్వామి, నిధి, బి.రమాదేవి, బిల్ల మహేందర్ హాజరవుతారన్నారు. వివిధ సమావేశాలకు సమన్వయకర్తలుగా బండారి సుజాత, బిట్ల అంజనీదేవి, మరాడి శ్యామల, కొలిపాక శోభారాణి, మడూరి అనిత వ్యవహరిస్తారని చెప్పారు. సభలకు అధ్యక్షత, నిర్వహణలు అనిశెట్టి రజిత, కొమ్మరాజు రామలక్ష్మిలు నిర్వహిస్తారు. ఓరుగల్లు సాహిత్య సంరంభానికి సాహితీవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులందరిని ఆహ్వానిస్తున్నట్టు వారు తెలిపారు. దక్షిణభారత దేశపు మొట్ట మొదటి మహిళా పరిపాలకురాలైన కాకతీ రుద్రమ పేరున దశాబ్దం కిందట ప్రారంభించిన రుద్రణ ప్రచురణలు ఇప్పటి వరకు 15 గ్రంథాలను ప్రచురించిందని తెలిపారు.

మానుకోట లోక్‌సభ బరిలో ఆదివాసీ నేత

స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ పోటీ

ఆదివాసీల ఓట్లే తుడుందెబ్బ అధ్యక్షుడి లక్ష్యం



కొత్తగూడ, మార్చి 15: తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదివాసీ విద్యావంతుడు మైపతి అరుణ్‌కుమార్ మానుకోట లోక్‌సభ నియోజకవర్గ బరిలో నిలుచోనున్నాడు. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులుగా లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వారిని నిలబెట్టారు. ఆదివాసీల తరపున గత లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ అరుణ్‌కుమార్.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో నిలబడనున్నారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కామారం గ్రామంలోని ఆదివాసీ వ్యవసాయ కుటుంబానికి చెందిన జగన్నాథరావు - సుగుణ దంపతుల రెండో కుమారుడు మైపతి అరుణ్‌కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాల్లో విద్యను అభ్యసించాడు. కాకతీయ యూనివర్శిటీలో ప్రభుత్వ పరిపాలన శాస్త్రంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ 5, 6 షెడ్యూల్డ్ ఏరియాలపై పీహెచ్‌డీని పూర్తిచేశారు. ఆదివాసీ హక్కుల పోరాటం సమితి (తుడుందెబ్బ) సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఆదివాసీ హక్కులు, చట్టాలపై చేసిన పోరాటాల్లో, ఉద్యమాల్లో, పాదయాత్రల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడిగా పోరాటాలు చేస్తున్నాడు.

కాగా, పార్లమెంటరీ విధానం ద్వారానే ఆదివాసీ హక్కులు, చట్టాల అమలు సాధ్యమవుతుందని గ్రహించిన అరుణ్‌కుమార్.. ఆదివాసీల ఓట్లు అధికంగా ఉన్న మానుకోట లోక్‌సభ నియోజకవర్గంలో గత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. 57,073 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల స్ఫూర్తితో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బరిలో పోటీ చేయనున్నారు. మానుకోట లోక్‌సభ పరిధిలో అత్యధికంగా ఉన్న ఆదివాసీ ఓటర్లను ఏకంచేసి గెలుపు సాధించేందుకు అరుణ్‌కుమార్ వ్యూహరచన చేస్తున్నాడు.

నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన సువర్ణ



ఉద్యోగ నియామకపత్రం అందుకుంటున్న సువర్ణ

పర్వతగిరి, మార్చి 15: ఒక ప్రభుత్వ ఉద్యోగానికే నానా తంటాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో ఒక గృహిణి కష్టపడి ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన పూజారి సువర్ణ ఎంఏ బీఈడీ చదివి తెలంగాణ గురుకుల ఉపాధ్యాయురాలు (టీజీటీ), పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉపాధ్యాయురాలు(పీజీటీ), గురుకుల జూనియర్ లెక్చరర్(జేఎల్) పోస్టులకు ఆగస్టు 2023 లో అప్పటి ప్రభుత్వం పరీక్షలు నిర్వహించగా పరీక్షలు రాసింది. కాగా, మార్చి 2024లో ఆయా పోస్టులకు చెందిన ఫలితాలు రావడంతో వరుసగా టీజీటీ, పీజీటీ, జేఎల్ మూడు పోస్టులకు ఎంపికైంది. వీటితో పాటు డీఎస్సీ 2008లో కూడా అర్హత సాధించినా... కోర్టు కేసు వల్ల జాప్యం నెలకొంది. ఇటీవల కోర్టు పరిష్కారం సూచించడంతో అందులోనూ ఉద్యోగం సాధించడంతో ఏకంగా నాలుగు ఉద్యోగాలు కైవసం చేసుకుంది. గృహిణిగా ఉంటూ తన భర్త పూజారి సురేష్ సహకారంతో తాను నాలుగు ఉద్యోగాలు సాధించినట్లు శుక్రవారం ఆమె తెలిపారు. ప్రస్తుతం ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో టీజీటీ ఉద్యోగం కోసం నియామక పత్రం తీసుకోగా, ఇతర ఉద్యోగాల కోసం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో తనకు అనుకూలమైన ఉద్యోగంలో చేరే అవకాశాలు ఉన్నాయి.

తప్పుల తడకగా స్టాఫ్ నర్సు మెరిట్ లిస్ట్

తమ వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు అడ్డదారులు

వరంగల్ మెడికల్, మార్చి 15: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. మెరిట్ ప్రొవిజినల్ లిస్టులో తప్పుల తడకగా ఉంది. ఒకే కోర్సులో మార్కులు ఇష్టారాజ్యంగా వేశారు. ఓ అభ్యర్థికి 2000 గరిష్ట మార్కులకు గాను 2018 మార్కులు వచ్చినట్లు మెరిట్ లిస్టులో చూపారు. మరో అభ్యర్థికి 1999 మార్కులు వచ్చినట్లు ప్రకటించారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టు చూసి నిరుద్యోగ అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు నియామకాలన్నీ ప్రతీసారి వివాదంగానే మారుతున్నాయి. ఈసారి మాత్రం మార్కుల వింతతో తమ వారికి ఉద్యోగాలు ఇప్పించేందుకు భారీ ప్రయత్నాలకు తెరలేపారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి మెరిట్ లిస్టును సరిచేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. అదేవిధంగా కొందరు అభ్యర్థులు జిరాక్స్ కాపీలపై ఎక్కువ మార్కులు వేసి దరఖాస్తు చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఈ బాగోతం వెనుక కార్యాలయ ఉద్యోగులు కూడా ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

భట్టిని కలిసిన రామగళ్ల పరమేశ్వర్



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో రామగళ్ల పరమేశ్వర్

హనుమకొండ సిటీ, మార్చి 15: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ ఆశావహుడు డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో భట్టిని కలిసి లోక్‌సభ టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ జీవితం, సామాజిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను భట్టికి విక్రమార్కకు విన్నవించి టికెట్ ఇప్పించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

హనుమకొండ టౌన్, మార్చి 15: తాగుడుకు బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తిచెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం కాపువాడలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. నల్లాటి రవి ప్రైవేట్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడని, తాగుడు బానిసైన రవి ఒక్కోసారి వారం రోజులైనా ఇంటికి రాకపోయేవాడన్నారు. ఈనెల 14వ తేదీన రాత్రి ఇంటికి వచ్చిన రవి.. తెల్లారేసరికి ఇంట్లో నిచ్చెనకు ఉరి వేసుకుని కుటుంబసభ్యులకు కనిపించాడు. మృతుడి కుమారుడు సుమిత్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, రవికి కుమార్తెతోపాటు భార్య సునిత ఉంది.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ టౌన్, మార్చి 15: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, సిటిజన్ క్లబ్, మోక్షావిల్లాస్, న్యూశాయంపేట ఏరియాలో మధ్యాహ్నం 1నుంచి 4గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. వడ్డెపల్లి, వెస్ట్ సిటీ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు, సోమిడి, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, టేకులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

డిగ్రీ కోర్సుల సెమిస్టర్ ఫీజుల గడువు 30

కేయూ క్యాంపస్, మార్చి 15: కేయూ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ ఫీజులు చెల్లించుకునేందుకు మార్చి 30 వరకు గడువు ఉందని కేయూ పరీక్షలనియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, డాక్టర్ ఎం.తిరుమలదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 4వరకు ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు.

ఇల్లు విక్రయం పేరిట మోసం

కటకటాల పాలైన కానిస్టేబుల్ దంపతులు

వరంగల్ క్రైం, మార్చి 15: లేని ఆస్తులు ఉన్నట్లు చూపించి డబ్బులు తీసుకుని పలువురిని మోసం చేసిన ఎం.డి. ఖాసీం అనే హెడ్ కానిస్టేబుల్ కటకటాల పాలయ్యాడు. సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.డి. ఖాసీం.. తన భార్య సహీదాతో కలిసి గోపాల్‌పూర్, భద్రకాళి కాలనీలో ఒక ఇంటిని విక్రయిస్తామని ధర్మసాగర్ మండలం ముల్కపల్లికి చెందిన ఓదెల లక్ష్మీ వద్ద రూ.50వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. 2019లో డబ్బులు తీసుకున్న కానిస్టేబుల్ దంపతులు.. ఇంటి విషయం ప్రస్తావించినప్పుడు దాటవేస్తూ వస్తున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఇటీవల బాధితురాలు లక్ష్మీ కానిస్టేబుల్ దంపతులపై ప్రజావాణిలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ఫిర్యాదు చేసింది. స్పందించిన కమిషనర్.. కానిస్టేబుల్ దంపతులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సుబేదారి సీఐని ఆదేశించారు. హెడ్ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మరో ఐదు కేసుల్లో బాధితుల నుంచి రూ.1కోటి 94లోల నగదు, 430గ్రాముల బంగారం తీసుకుని మోసం చేసినట్లు తేలింది. హనుమకొండ, మిల్స్‌కాలనీ, కాజీపేట, ధర్మసాగర్, సుబేదారి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు విచారణలో బహిర్గతమైంది. విచారణ అనంతరం గత రాత్రి హెడ్ కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

రైలింజన్‌లో సాంకేతిక లోపం

కాజీపేట, మార్చి 15: హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలింజన్‌కు శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తింది. కాజీపేట జంక్షన్‌నుంచి బయలుదేరి హసన్‌పర్తి రైల్వే స్టేషన్ దాటిన కొద్ది నిమిషాలకే రైలింజన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. ఇంజన్‌ను మరమ్మతులు చేసేందుకు రైల్వే అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడే ఉన్న మరో ఇంజన్ తెప్పించగా అది కూడా మొరాయించింది. దీంతో మరో ఇంజన్ తెప్పించి ఇంటర్‌సిటీ బోగీలకు తగిలించి పంపించారు. ఇందుకు సుమారు రెండుగంటలు పట్టింది. దీంతో సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ, చెన్నై నుంచి ఢిల్లీ వెళ్లే పలు రైళ్లను హసన్‌పర్తి రైల్వే స్టేషన్ సమీపంలో నిలిపివేశారు. ఇంటర్‌సిటీ రైలు వెళ్లిన తర్వాత మిగతా రైళ్లను పంపించారు. ఈ కారణంగా పలు రైల్లు ఆలస్యంగా నడిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఇద్దరు సీఐ, ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 15: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలలో ఎస్.కరుణాకర్ టాస్క్‌ఫోర్స్ నుంచి మహిళా పోలీస్ స్టేషన్(సుబేదారి), ఎస్.వెంకట్రాం మహిళా పోలీస్ స్టేషన్ నుంచి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్ఐలలో బి.రామారావు హనుమకొండ నుంచి నల్లబెల్లి, ఎస్.నగేష్ నల్లబెల్లి నుంచి వీఆర్ బదిలీ అయ్యారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు

- పెండింగ్‌లో ఉన్న నెల రోజుల జీతం
- దయనీయ స్థితిలో శానిటేషన్ సిబ్బంది
- నూతన కమిషనర్ స్పందించాలని విజ్ఞప్తి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15 : వారు రెక్కాడితే గానీ డొక్కాడని పేద బడుగుజీవులు.. ఉదయం లేచి ప్రజలు ప్రశాంతంగా నడిచేందుకు రోడ్లను శుభ్రం చేసి చీపుర్లతో ఊడ్చి అద్దంగా దిద్దే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు.. కానీ వారికి సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్ వరంగల్ కార్యాలయంతో పాటు రెండు సర్కిల్ కార్యాలయాలు 12 సెంటర్లలలో సుమారు 3,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. చెత్త శుభ్రం చేయడం మొదలుకుని చెత్తను తరలించేవారు, ప్రైవేటు జవాన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, స్వీపర్లు, అటెండర్లు మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్నారు. వీరికి నెల జీతం వస్తే గానీ ఇళ్ల గడిచే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో గ్రేటర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతీ నెల 20 తేదీ నుంచి 20 వరకు నెల రోజులుగా గుర్తించి ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు విడుదల చేస్తారు. అయితే డిసెంబరు మాసంలో నిర్వహించిన విధులకు సంబంధించిన జీతం జనవరి 20న డ్రా చేసుకున్నారు. కానీ జనవరి నెల జీతం ఫిబ్రవరి 20 వరకు కాకుండా మార్చి నెల సగం గడిచిపోయినా అందలేదు. జీతం తీసుకునే సమయం దాటి 15 రోజులు ముగిసిన అధికారులలో చలనం లేదని మండిపడుతున్నారు. జీతం రాక గాసం లేక ఇబ్బందితో అయోమయానికి గురవుతున్నారు. కొందరు ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, చిల్లర సామాను, నెల వారి చిట్టీలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్టు చెప్పారు.

ఆలస్యం కావడంతో అందరికీ టెన్షన్

నెల దాటినా ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో అందరిలో ఆందోళన మొదలైంది. కార్మికులు తరుచుగా సెల్‌ఫోన్‌కు ఎప్పుడు మెస్సేజ్ వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఇంకా కొందరు సఫాయి కార్మికులు తరుచుగా బ్యాంకుల వద్దకు వెళ్లి తమ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయ? అని అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. జీతాలు రాకపోవడంతో కొందరికి ఆటోచార్జీలు లేక విధులకు గైర్హాజరు అవుతున్నట్టు చెప్పారు. అధికారులు స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అశ్విని వేతనాలపై దృష్టిసారించాలని కార్మికులు వేడుకుంటున్నారు.





ఆంధ్రజ్యోతి WARANGAL CITY

వరంగల్ సిటీ

• వరంగల్ • ఖిలావరంగల్ • గీసుగొండ • సంగెం

శనివారం 16 మార్చి 2024

నగరంలో సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు..

వరంగల్ చౌరస్తా, మార్చి 15: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ ఏసీపీ సూచనల అనుగుణంగా ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్ సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు నిర్వహించారు. వరంగల్ చౌరస్తా నుంచి కాశిబుగ్గ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ కవాతు ప్రజల్లో శాంతి భద్రతల పట్ల ఎలాంటి అపోహాలు లేకుండా భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం కోసం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించడం జరిగిందని సీఐ శివకుమార్ తెలిపారు.



పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరత

• భర్తీకి నోచుకోని ఖాళీ పోస్టులు • సిబ్బందిపై పని భారం • మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీలో ఇక్కట్లు

మట్టెవాడ, మార్చి 15: వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో మూడు పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరతతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతోంది. కాని స్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, ఏఎస్సైల కొరత ఉంది. సత్వర సేవలు అందించేందుకు సాంకేతికతను ఉపయోగి ంచుకుంటున్న పోలీ సుశాఖకు సిబ్బంది కొరత వేధిస్తోంది. సిబ్బంది విషయంలో పోలీసు శాఖ ఒకింత వెనుకడుగానే ఉంది. వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్లున్నాయి. ఆయా పోలీసు స్టేషన్లలో కొందరు ఎస్సైలు బయట బందోబస్తు ఇతర విధుల్లో ఉండటంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎస్సైల కుర్చీలు ఖాళీ..

ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్‌లో నలుగురు ఎస్సైలు ఉండాల్సి ఉండగా ఇద్దరు ఎస్సైలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో ఐదుగురు ఎస్సైలు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. మట్టెవాడలో నలుగురు ఎస్సైలు ఉండాల్సి ఉండగా ముగ్గురే ఉన్నారు. అలాగే పోలీసు కానిస్టేబుళ్లు, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్ల కొరత వేధిస్తోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతోందని వాపోతున్నారు. వరంగల్‌లో బందోబస్తులు, మంత్రుల పర్యటనలు, వివిధ సామాజిక కార్యక్రమాలు, సభలు, సమావేశాల భద్రత, పండుగలు, ఉత్సవాలు, ప్రముఖుల పర్యటనలతో పోలీసు స్టేషన్లలోని సిబ్బంది బందోబస్తు విధుల్లో ఎక్కువ సమయం గడపవలసి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. స్టేషన్‌లో ఫిర్యాదులపై విచారణ, కేసుల విచారణ, కొంత మంది కోర్టు విధులు నిర్వహి స్తుండంతో ఫిర్యాదుల పరిష్కారానికి సమయం సరిపోవడం లేదు. పని ఒత్తిడి పెరుగుతుందని సిబ్బ ంది వాపోతున్నారు. ఒక్కోసారి డబుల్ డ్యూటీలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత..

వరంగల్ పోలీస్ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉంది. సీఐ నుంచి కానిస్టేబుళ్ల వరకు 250 మంది పోలీసు సిబ్బంది వరంగల్ సబ్ డివిజన్‌లో ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 167 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 83 మంది సిబ్బంది కొరత ఉందని పోలీసు రికార్డులు తెలుపుతున్నాయి.

మట్టెవాడ పోలీసు స్టేషన్..

మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో నలుగురు ఎస్సైలకు గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఏఎస్సైలు ఆరు గురు ఉండాల్సిందిగా ఐదుగురు, హెడ్ కానిస్టేబుళ్లు 14 మంది ఉండాల్సిందిగా 13 మంది, కానిస్టేబుళ్లు 69 మంది ఉండాల్సిందిగా 29 మంది మాత్రమే ఉన్నారు. మహిళా కానిస్టేబుళ్లు ఆరుగురు ఉండాల్సిందిగా నలుగురు మాత్రమే ఉన్నారు. ఈ స్టేషన్‌లో కానిస్టేబుళ్ల కొతర ఎక్కువగా ఉంది.

మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్..

మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో ఐదుగురు ఎస్సైలు ఉండాల్సిందిగా ఇద్దరు ఎస్సైలే ఉన్నారు. ఏఎస్సైలు 8 మంది ఉండాల్సిందిగా ఐదుగురు, హెడ్ కానిస్టేబుళ్ల 10మందికి గాను తొమ్మిది, కానిస్టేబుళ్ల 53 మందికి 26 మంది మాత్రమే ఉన్నారు. మహిళా పోలీసులు నలుగురు ఉండాల్సిందిగా ఇద్దరే ఉన్నారు.



మట్టెవాడ పోలీస్‌స్టేషన్

ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్..

ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో నలుగురు ఎస్సైలు ఉండాల్సిందిగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. హెడ్ కానిస్టేబుళ్ల 12 మందికి 10మంది, కానిస్టేబుళ్ల 53 మందికి గాను 26 మంది విధులు నిర్వహిస్తున్నారు. మహిళా కానిస్టేబుళ్ల నలుగురు ఉండాల్సిందిగా ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ

ఎండుగంజాయి తరలిస్తున్న బీహార్‌కు చెందిన ఇద్దరి అరెస్టు

రూ.15లక్షల విలువైన 61 కిలోల ఎండుగంజాయి స్వాధీనం

కరీమాబాద్, మార్చి 15: ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసి, రూ.15లక్షల విలువైన 61కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుల వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ 14న ఎస్సై మునీరుల్లా శివనగర్ గేటు వైపు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు కొన్ని బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. బీహార్ రాష్ట్రం, వైశాలి జిల్లా, రాఘవాపూర్ తానా, మల్లిక్‌పూర్ గ్రామానికి చెందిన మున్నాకుమార్, మిథున్‌కుమార్‌లు ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు కావడంతో పూణేలో వెల్డింగ్, కూలీపనులు చేసేవారని, ఆదాయం సరిపోకపోవడంతో, దురాశతో ఒరిస్సా, భువనేశ్వర్ వెళ్ళి గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయిని తక్కువ రేటుకు కిలో రూ.5వేల చొప్పున కొనుగోలు చేసి మహారాష్ట్రలోని సోలాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులకు ఎక్కువ ధరకు విక్రయించాలని పథకం వేసినట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఒరిస్సా, భువనేశ్వర్‌లో కొనుగోలు చేసిన 61కిలోల ఎండు గంజాయిని పూణేకు తరలించేందుకు టిక్కెట్ తీసుకొని కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కినట్టు పేర్కొన్నారు. వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే పోలీసులు రైలులో తనిఖీలు చేపట్టడం గమనించిన నిందితులు భయంతో వేరే మార్గం గుండా వెల్దామని వరంగల్‌లో తమ వద్ద ఉన్న ఎండుగంజాయి బ్యాగులతో వరంగల్‌లో ట్రైన్ దిగి స్టేషన్ బయటకు వచ్చి ఆటో కొరకు ఎదురు చస్తుండగా అటువైపుగా పోలీసులకు చిక్కినట్టు సీఐ వెల్లడించారు.

ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 15: ఓటు హక్కు, ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహనపై చైతన్యం కల్పించాలని నోడల్ అధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. త్వరలో జరగనున్న సాధారణ లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని డీఆర్‌డీవో కార్యాలయంలో శుక్రవారం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) 2024పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం టీఎల్ఎఫ్, సీఓలు, ఆర్‌పీలు, ఓబీలచే నేను కచ్చితంగా ఓటు వేస్తానని ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కౌసల్యాదేవి, బల్దియా టీపీఆర్ఓ కోలా రాజేష్ కుమార్, డీఎంసీ రేణుక పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ

గిర్మాజీపేట,మార్చి 15 : కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇంతేజార్‌గంజ్ సీఐ శివకుమార్ టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు,పెన్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం జి.అశోక్ కుమార్ అధ్యక్షతన టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో 10వ తరగతి కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు భూపాల్, సందీప్‌కుమార్, కృష్ణారావు, మస్నా వెంకటేశ్వర్లు, భవాని, కరుణ, శైలజ, సరస్వతి, రాధిక, రమేష్, రాహుల్ పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

సంగెం, మార్చి 15 : వస్తువుల కొనుగోలు విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సీసీఐ (కన్సుమారు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ సూచించారు. బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. కన్సుమారు కౌన్సిల్స్ ఫెడరేషన్ కార్యదర్శి త్రిపురోజు రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఇంట్రాక్షన్ ప్రోగ్రాంకు సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులు సత్యవతి, మదన్మోహన్, రేఖాదేవి, హారిక, సుప్రియ, రావుల రంజిత్, నరహరి పాల్గొన్నారు.

● కరీమాబాద్ : మోసాలకు గురికాకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర ఉపన్యాసకులు టి.శ్రీనివాస్, అధ్యాపకులు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

గ్రేటర్ వరంగల్ ఏఈలకు పదోన్నతులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్)లకు డీఈ (డిప్యూటీ ఇంజనీర్లు) గా పదోన్నతి కల్పిస్తూ ఇంజనీరింగ్ చీఫ్ (ఈఎన్‌సీ) కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పదోన్నతులు పొందిన వారిలో కృష్ణమూర్తి, అజ్మీర శ్రీకాంత్ ఉన్నారు. పదోన్నతులు పొందిన ఇద్దరు అధికారులు బల్దియా కార్యాలయంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కమిషనర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

స్కూల్ యూనిఫాం కొలతల ప్రకారం కుట్టాలి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 15: మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వం స్కూల్ పిల్లలకు యూనిఫాం కుట్టించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు డీఆర్‌డీవో కౌసల్యదేవి తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో విద్యాశాఖ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్, మైనారిటీ, బీసీ వెల్ఫేర్ శాఖలకు సంబంధించిన అధికారు లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కౌసల్యదేవి మాట్లాడారు. మెప్మా, మండల సమైక్య, ఏపీఎం సంబంధిత అధికా రులు, టీఎల్ఎఫ్ సిబ్బంది, టీఎల్ఎఫ్ ఓబీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

కేంద్రం బలగాలతో పోలీసుల కవాతు

సంగెం, మార్చి 15: గవిచర్ల గ్రామంలో శుక్రవారం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహాయ సహకారాలు అందించాలని మామునూరు ఏసీపీ తిరుపతి కోరారు. సంగెం పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన కవాతులో పర్వతగిరి, గీసుగొండ సీఐ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖిలావరంగల్, మార్చి 15: ముదిరాజ్‌లకు చట్టసభలో ప్రత్యేక కార్పొ రేషన్‌ను ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జిల్లా తెలంగాణ ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు సంగరబోయిన చందర్ క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం తూర్పుకోట హనుమాన్ సెంటర్‌లో చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముదిరాజ్ కులస్థులు సిరబోయిన సారంగపాని, మేకల కు మారస్వామి, మేకల కృష్ణ, సుక్క రాజు, బొళ్ళ సూరయ్య, సిరబోయిన సుధాకర్, సిరబోయిన సారంగం, అల్లం కేశవరాజు, జెటబోయిన వేణు, మేకల రమేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలు శిక్ష..

మట్టెవాడ, మార్చి 15: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో తమ్మిశెట్టి తిరుపతికి మూడు రోజుల జైలు శిక్ష వేస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. మద్యం తాగి పాపయ్యపేట చమన్ నుంచి ఆటో నగర్‌కు ఈ నెల 13న వెళ్తున్న తిరుపతి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. తిరుపతికి మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్షను విధించారు. మహబూబాబాద్ సబ్ జైలుకు పంపారు. కాగా, వరంగల్ నగరంలో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కారు. వారిని శుక్రవారం జువైనల్ కోర్టులో హాజరు పర్చగా కోర్టు ఐదుగురు మైనర్లను రె ండు రోజుల పాటు అబ్జర్వేషన్ హోంకు తరలించాలని తీర్పు నిచ్చారు. దీంతో బా లల అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 15: వినియోగదారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో వినియోగదారుల న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆహారకల్తీ నిరోధించాల్సిన అవసరం ఉందని, కల్తీ నిరోధానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.సంధ్యారాణి, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ప్రవీణ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్దార్థ రెడ్డి, డీసీఐసీ ప్రెసిడెంట్ సుదర్శన్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు దామోదర్, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, కన్స్యూమర్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, నంద కుమారి, జిల్లాలోని రేషన్ డీలర్లు, గ్యాస్ డీలర్స్, పెట్రోల్ బంక్, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఆలోచింపజేసిన సైన్స్‌ఫెయిర్

గీసుగొండ, మార్చి 15: ధర్మారం విజ్ఞాన్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్‌లు ఆలోచింపజేశాయి. గాలిలో తేలియాడే మనిషి, కటకాలతో మ్యాజిక్‌లు, బెర్నోలీలా, ఆధునిక పనిముట్లతో వ్యవసాయం, సోలార్ శక్తితో ఉత్పాదక ఉపయోగాలు వంటి అంశాల ఎగ్జిబిట్‌లు ఆకర్శణగా నిలిచాయి. నూతన విద్యావిధానంలో ప్రాథమిక స్థాయి లో ఆధునాతన బోధనల డిజిటల్ క్లాస్‌ల ద్వారా విద్యార్థులు వివరించటం ఆసక్తిని రేకెత్తించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, ఉపాధ్యాయులు కళావతి, శిల్ప, ప్రియాంక, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

సంగెం, మార్చి 15 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి అన్నారు. మండలం కేంద్రంలో శుక్రవారం ఆమె జడ్పీహెచ్ఎస్ పాఠశాల, గవిచర్ల గ్రామంలోని మోడల్ స్కూల్‌లను పర్యటించి పరిశీలించారు. కళావతి మాట్లాడుతూ ప్రభుత్వ కల్పించే సౌకార్యాలను విద్యార్థులకు అందించేందుకు సంబంధిత శాఖ అధికారులు పరిశీలించాలని కోరారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనంను ఎంపీపీ పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విక్రమ్, గవిచర్ల ప్రిన్సిపాల్ రెహ్మాన్, ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య పాల్గొన్నారు.

●పశు వైద్య శిబిరం ప్రారంభం

చింతలపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఎంపీపీ కందకట్ల కళావతి ప్రారంభించారు. సంగెం పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన శిభిరంలో మండలంలోని పశువులను గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ వల్లెరాజు, ఎంపీటీసీ బొమ్మ యుగేందర్, పావని, మాజీ సర్పంచ్ బండి రాధిక పాల్గొన్నారు.

మంత్రి సురేఖను కలిసిన మునిసిపల్ కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అశ్విని తానాజీ వాకడే శుక్రవారం రాష్ట్ర అటవీ, పర్యాటక శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. హైదరాబాద్ సచివాలయంలో మంత్రిని మర్యాద పూర్వకం గా కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా అశ్విని తా నాజీ వాకడే వరంగల్ మున్సిప ల్ కార్పొరేషన్ పరిధిలో చేపడు తున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న ప్రణాళికలపై మంత్రి సురేఖకు విశ్లేషించారు. మంత్రి కమిషనర్‌కు పలు సూచనలు చేశారు.



మంత్రికి మొక్కను అందిస్తున్న తానాజీ వాకడే

జనాభా ప్రకారం బీసీలకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలి

ఖిలావరంగల్, మార్చి 15: జనాభా ప్రకారం బీసీలకు చట్టసభల్లో రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి నిర్మాణ బాధ్యుడు పంజాల రమేష్ కోరారు. శుక్రవారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంపద సృష్టికర్తల్లో అత్యధిక కులాలైనటువంటి కార్మిక వర్గాలకు చెందినటువంటి బీసీ కులాలు సంపద సృష్టికర్తలుగా మిగిలిపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాషుమియా, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి వలబోజు వెంకన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స రవిందర్, దండు లక్ష్మ ణ్, గుండే బద్రి, సంగి ఏలేందర్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు మియాపురం గోవర్ధన్, చిట్యాల సువర్ణ, మెరుగు మల్లయ్య పాల్గొన్నారు.

బల్దియా ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల సంఘం ఎన్నిక



అదనపు కమిషనర్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న నూతనకార్యవర్గం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు శుక్రవారం బల్దియా కార్యాలయం ఆవణలో జరిగాయి. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మేకల దేవేందర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నాగుల శ్రీకాంత్, కోశాధికారిగా దొడ్డిపాటి రాజేందర్, ఉపాధ్యక్షులుగా కొత్తపెల్లి కుమార్, కేతిరి పైడయ్య, కార్యదర్శిగా ఉసిల్ల ఆనందరావు, ప్రచార కార్యదర్శిగా పైనాల క్రాంతికుమార్, గుంజ రవి ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎన్నికల పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ప్రమాణం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు మున్సిపల్ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వార నూతన కమిటీని అభినందించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం రవియాదవ్, ఐలయ్య, బైరబోయిన గట్టయ్య అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మట్టెవాడ, మార్చి 15: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగపర్చుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం 29వ డివిజన్ రామన్నపేటలో షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. 12 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ, మాజీ కౌన్సిలర్ బుద్ధ జగన్, సయ్యద్ రఫీ, జి. మహేష్, మాజీ కార్పొరేటర్ తోట నవీన్, సయ్యద్ అజ్గర్, రావుల అరుణ్, సలీం, పద్మ, వినయ్ పాల్గొన్నారు.

● బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండ..

బడుగు, బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 29వ డివిజన్ రామన్నపేటలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.30 లక్షల నిధులతో చేపట్టే రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగపర్చుకోవాలన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

● భద్రకాళి అమ్మవారి సన్నిధిలో నాయిని పూజలు

చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆలయానికి చేరుకున్న నాయినికి అర్చకులు పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

ఆంధ్రజ్యోతి Classifieds

WANTED
★ మా షాప్‌లో పనిచేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. Timings : 9.30 to 6 pm, జీతం : 6,500/- మరియు టైలర్ బాయ్స్ కావలెను Timings : 12 pm to 10 pm, జీతం : 10,000 + అలవెన్స్. సంప్ర: 6309708800, 7093763375
AJW-177993

WANTED
★ ప్రముఖ బ్యూటీ పార్లర్‌లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన లేడీవర్కర్ కావలెను. ఉచిత వసతి + రూమ్ + భోజనం కలదు. సెల్ : 9951716914.
AJM-11602

WANTED HOSPITAL STAFF
★ GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ మరియు LAB టెక్నీషియన్స్ అనుభవంగలవారు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్. 12 to 2 pm.
AJW-0361

WANTED DRIVERS
★ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయడానికి DCM & బొలెరో డ్రైవర్స్ కావలెను. Phone Call Timings 11 am to 6 pm. Cell : 9396991649
AJW-5853

WANTED HELPERS
★ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయడానికి హెల్పర్స్ కావలెను. Salary : 14,000/-. Phone Call Timings 11 am to 6 pm. Only Boys. Cell : 9396991649
AJW-5854

WANTED
★ హనుమకొండలో మా సంస్థ నందు పనిచేయుటకు 3 వీలర్ బ్యాడ్జ్ కలిగిన డ్రైవర్ + సప్లై బాయ్ కావలెను. సంప్ర: 9666717040, 9390562110
AJW-14210

కావలెను
★ A to Z బజార్ నందు సెక్యూరిటీగా పనిచేయుటకు అమ్మాయిలు, అబ్బాయిలు కావలెను. సంప్ర: A to Z Bazar, అదాలత్ సర్కిల్, HNK. Cell : 9059040017
AJW-14208

సెక్యూరిటి గార్డ్స్ వెంటనె కావలెను
★ WGL, HNK నందు గల Show Rooms, Hospitals నందు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. మరియు మా ఆఫీస్ నందు ఆఫీస్ అసిస్టెంట్ వెంటనే కావలెను. జీతం : 10,000/- to 15,000/-. సంప్ర: 6309922608.
AJW-0365

కావలెను
★ ఇంట్లో పని చేయడానికి భార్యభర్తలు కావలెను. రూమ్ ఫ్రీ, జీతం (ఇద్దరికి కలిపి) 17,000/-. అడ్రస్ : యాదవనగర్ పెట్రోల్ పంప్, రెడ్డి కాలనీ, హన్మకొండ. సెల్ : 9581501234
AJW-177988

లోన్స్ ఇప్పించబడును.
★ వ్యాపార ఋణాలు (MSME) గృహ ఋణాలు, గృహ తనఖ ఋణాలు (NRI) (Commercial) నేషనల్ బ్యాంకుల ద్వారా మరియు ప్రైవేట్ బ్యాంకుల ద్వారా అన్ని రకాల లోన్స్ ఇప్పించబడును. సెల్ : 73823 33356, 97043 40702
AJK-185636

కపిలేశ్వర వాటర్ ప్రూఫింగ్
★ మీ బిల్డింగ్‌లోని బాత్‌రూమ్స్ మరియు స్లాబ్ సైడ్ గోడ, రూఫ్, ఓవర్ హెడ్ ట్యాంక్స్ వర్షాకాలం లీకేజీలకు శాశ్వత పరిష్కారం కెమికల్స్, ఇంజక్షన్ గ్రౌట్ టెక్నాలజీ ద్వారా 100% గ్యారంటీతో చేయడమైనది. Ph : 9059135404.
AJW-159722

CHANGE OF NAME
★ I, ADPA SRINIVASULU S/O. ADPA VENKAT (Old Name) H.No.2-10-288 To 291, F-Block, Flat No.202 GMR, Brindavan Apts, Waddepally, Hanumakonda Town & Dist-506370, T.S. have changed my name as ADAPA SRINIVASULU S/o. ADAPA VENKAT NARSAIAH (New Name) for all purposes.
AJW-5855

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

HOUSE FOR SALE
★ ఉర్సు గుట్ట నుండి కాజీపేట్ వెళ్ళె 150 ఫీట్ల రోడ్ ప్రక్కన దేశాయిపేట SR Prime School కు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Independent Houses అమ్మకానికి కలవు. సంప్ర: 7660008666, 8309035091
AJW-27476

FLATS FOR SALE
★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సంప్ర: 7660008666, 8309035091
AJW-27475

HOUSE FOR SALE
★ ములుగు రోడ్ కాకతీయ కెనాల్ బ్రిడ్జ్ ములుగుపతి బిస్కెట్ దగ్గరలో G+1 తో గల గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న Independent House అమ్మకానికి కలదు. సెల్ : 7660008666, 8309035091
AJW-27477

HOUSE FOR SALE
★ హన్మకొండ, NGO's Colony లో గల 160 చ॥గజాల 2 BHK, G+1 ఇల్లు అమ్మబడును. సంప్ర: 8074106289, 9491941487
AJW-177986

FLAT FOR SALE
★ హన్మకొండ చైతన్యపురి కాలనీ NIT దగ్గర సిద్ధార్థ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో 2nd Floor East Face, 1504 Sft. Flat అమ్మబడును. సంప్ర: 9177999950
AJW-177987

FLATS FOR SALE
★ వరంగల్ 1st బ్యాంక్ కాలనీ (కొత్తవాడ) లో "3 LUXURIOUS & LAVISH 3-BHK FLATS" అమ్మకానికి కలవు (1st, 2nd & 5th Floor మాత్రమే - ఒక్కోటి 2500 SFT AREA). ఫ్లాట్స్ డెలివరి: APR 2024. Cell : 9393538001
AJW-5848

HOUSE FOR SALE
★ వరంగల్ హంటర్ రోడ్, సంతోషిమాత గుడి లైన్‌లో 240 గజాలలో G+1 ఇల్లు అమ్మకానికి కలదు. ధర : 1.30 కోట్లు. నో బ్రోకర్స్. సంప్ర: 8106071999
AJW-14205

LAND FOR SALE
★ మామునూర్‌లో కుడా లేఅవుట్ కింద దిశల్లో చౌరస్తా నుండి మరియు జక్కలొద్దిలో ఆల్ఫా పాఠశాల పక్కనుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పురా డాంబర్ రోడ్డు పై సైట్ ఫేసింగ్ 263, 228 అమ్మకానికి కలదు. సంప్ర: 9032111690
AJW-159756

KUDA PLOT FOR SALE
★ Oglapur Main Road అతి దగ్గరలో 100 ఫీట్ల రోడ్డు, 40 ఫీట్ల రోడ్ గల KUDA Plots కలవు. ధర 7,500/- నుండి 8,999/- వరకు. సంప్ర: సిరి - 6301613156
AJW-177991

FLAT FOR SALE
★ FLAT FOR SALE: HUNTER ROAD, WARANGAL 3BHK FLAT 1970 SFT. 2nd FLOOR, WITH WOOD WORK @ YATHIRAJA NILAYAM GENUINE PERSONS CALL : 9490022014/16
AJH-002288

RENTAL FOR SCHOOL BUILDING
★ Station Ghanpur (Mdl), Shivunipally (Vill) లోని Aditya Model School Building Rental కు ఇవ్వబడును. ఆసక్తిగలవారు స్కూల్‌లో సంప్రదించగలరు. Cell : 9391180737, 8374650070, 8555909524
AJW-5852

CHANGE OF NAME
★ I, MOHAMMED FAROOQ (Old Name) H.No. 24-3-328, Basith Nagar, FCI Colony, Julywada, Hanumakonda City & Dist-506001, T.S. have changed my name as MOHAMMED FAROOQ AHMED (New Name) S/o. ATHEEK AHMED for all Purposes.
AJW-5855

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 16 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

శివుడి సేవలో తరిస్తున్నాం ...

వర్ధన్నపేట రూరల్, మార్చి 15 : పరమ శివుడికి సేవ చేయడంతో పాటు తోచిన సహాయం చేస్తూ ఆయన సేవలో తరిస్తున్నామని గొడిశాల సంధ్యారాణి-సురేందర్ దంపతులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లంద గ్రామ ఆకేరు వాగు ఒడ్డున ఉన్న శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి శివలింగానికి రూ.50 వేల విలువ చేసే నాగపడిగను అందించారు. గతంలో దేవాలయ నిర్మాణానికి సైతం స్థలాన్ని దాతగా ఇచ్చి ఆయన ఉదారతను చాటుకున్నారు. ఆలయానికి వచ్చిన వారిని అర్చకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గొడిశాల సురేందర్ దంపతులు

వరంగల్ ఎంపీ టికెట్ మాదిగలకే కేటాయించాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 15 : వరంగల్ పార్లమెంటు టిక్కెట్‌ను కాంగ్రెస్ పార్టీ మాదిగలకే కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు సముచిత స్థానాన్ని కల్పించేలా వరంగల్ ఎంపీ టిక్కెట్‌ను స్థానిక మాదిగలకే ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ కార్పొరేషన్ ఛైర్మన్ల ఎంపికలో కూడా మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

• దుగ్గొండి : వరంగల్ పార్లమెంట్ టిక్కెట్‌ను కాంగ్రెస్ పార్టీ మాదిగ లకు



దుగ్గొండి మండల ఎంహెచ్‌డీ కమిటీ ఎంపిక ఉత్తర్వులు అందిస్తున్న ప్రదీప్‌మాదిగ

కేటాయిం చాలని మాదిగ హక్కుల దండోర (ఎంహెచ్‌డీ) వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ మాదిగ డిమాండ్ చేశారు. మండలంలోని నాచినపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రదీప్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేయడం జరిగిందని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాదిగలకు టిక్కెట్ కేటాంచి న్యాయం చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా జన్ను గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోడేటి వినోద్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రెల సుధాకర్‌లను ఎంపిక చేసినట్లు ప్రదీప్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జన్ను సతీష్, బైరపాక సురేశ్, పరికి రాజు, చేరాలు, ప్రశాంత్, మనుబోతుల శివకుమార్‌లు పాల్గొన్నారు.

పోస్టింగులు ఇచ్చినా రావడంలే..

• ఖాళీగా నర్సంపేట్ ఎస్ఐ కుర్చీ.. వచ్చేందుకు ఆసక్తి చూపని వైనం

• ఎస్సైల రాకకోసం ఎదురుచూస్తున్న మోడల్ పోలీస్‌స్టేషన్

నర్సంపేట టౌన్, మార్చి 15 : వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మోడల్ పోలీస్ స్టేషన్‌లో ఒకటైన నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు ఖాళీ అయ్యారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీలు జరుగగా, అందులో నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సైలకు స్థానచలనం జరిగింది. ఇక్కడకు పోస్టింగ్‌లు ఇచ్చినప్పటికీ ఎస్సైలు విధుల్లో చేరడానికి ఆసక్తి చూపకపోవడంతో ఎస్సైల కోసం పోలీస్ స్టేషన్ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. నర్సంపేట మోడల్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఎస్‌హెచ్‌ఓ, ముగ్గురు ఎస్సైలు విధులు నిర్వహిస్తారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోకి నియోజకవర్గ కేంద్రంగా ఉన్న నర్సంపేట పట్టణంతో పాటు మండలంలోని 27 గ్రామ పంచాయతీలు వస్తాయి. రాజకీయ ఘర్షణ, భూ దందాలు, సెటిల్‌మెంట్‌లు, చోరీలు, రోడ్డు ప్రమాదాలు నిత్యం నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంటాయి. వీటన్నింటిని నియంత్రించడానికి స్టేషన్‌లో ఉన్న అరకొర సిబ్బందితో అధికారులు నెట్టుకొస్తున్నారు. అలాంటి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు పోస్టింగ్‌లు ఇచ్చినా విధుల్లో చేరకపోవడం, దీనిపై ఉన్నతాధికారులు మౌనం వహించడంపై సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నది. ఇటీవల కాలంలో చోరీలు పెరిగిపోవడంతో ప్రజలకు కంటి మీద కునుకు ఉండడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో తర్వాత ప్రధానమైన విధులు నిర్వహించే ఎస్సైలు లేకపోవడంతో ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సైలు విధుల్లో చేరకపోవడంలో మతలబేంటో?

నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు ఎస్సైలు శీలం రవి, రాజు, చరణ్‌లు విధులు నిర్వహించేవారు. చరణ్ రెండు నెలల క్రితమే అధికారులకు బదిలీ కోసం



నర్సంపేట పోలీస్‌స్టేషన్

ఆర్జీ పెట్టుకొని ఇక్కడి నుంచి వెళ్లారు. శీలం రవి, రాజులు ఇటీవల బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో రామారావు, మాధవ్‌లు బదిలీ కాగా, వారిద్దరు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టకుండానే ఇక్కడి నుంచి బదిలీ చేయించుకున్నారు. మళ్లీ వీఆర్ నుంచి డి.విజయ్‌కుమార్, బి.ప్రవీన్‌లను నర్సంపేటకు బదిలీ చేశారు. వారు సైతం శుక్రవారం వరకు బాధ్యతలు చేపట్టలేదు. స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌వోదే పెత్తనం ఉంటుందని, తమకు అధికారులు తక్కువ ఉంటాయేమోనన్న ఆలోచనలతో ఎస్సైలు విధుల్లో చేరడం లేదా అనే అనుమానాలు వెల్లడవుతున్నాయి. ఇదిలావుంటే నర్సంపేట పోలీస్టేషన్ అధికారులపై రాజకీయ నాయకుల జోక్యం విపరీతంగా ఉండడం వల్లనేమో గాని ఎస్సైలు విధుల్లో చేరడానికి ఆసక్తి చూపడం లేదా అనే గుసుగుసలు వినబడుతున్నాయి. ఏది ఏమైనా ప్రజలు ఇబ్బందులు పడకుండా పోలీస్‌స్టేషన్‌లో వెంటనే ఎస్సైలు బాధ్యతలు చేపట్టేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సివుంది.

రైతుకు ధీమా.. పంటల బీమా

• ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకుంటే మేలు

• లోపాలు సవరించాలంటున్న రైతులు

వర్ధన్నపేట, మార్చి 15 : ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు జరిగే నష్టం నుంచి ఉపశమనం కోసం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకంతో రైతులకు ధీమా ఏర్పడనుంది. రైతులకు పంట చేతికి వచ్చే వరకు నమ్మకం ఉండడం లేదు. అనావృష్టి లేదా అతివృష్టి సంభవించిన ప్రతీ సంవత్సరం రైతులు నష్టపోతున్నారు. పండించిన పంటలకు పెట్టుబడి రాకపోవడంతో అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల నుంచి రైతులకు ఊరట కల్పించేందుకు పంటల బీమా పథకం అమలు చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు చేసింది. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజనలో భాగస్వామ్యం అయింది. గ్రామం యూనిట్‌గా తీసుకోవడంతో రైతులకు ప్రయోజనం ఉండడంలేదని పథకం నుంచి వైదొలగించింది. 2020 తర్వాత పంటల బీమా లేకుండాపోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజనలో చేరడానికి సుముఖత వ్యక్తం చేసింది. దీంతోపాటు రైతులు చెల్లించే ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించడానికి ముందుకు వచ్చింది.

• **లోపాలు సవరించాలంటున్న రైతులు**

గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల ఏ రైతుకు ప్రయోజనం చేకూరదు. దిగుబడి అంచనా వేసి పరిహారం ఇవ్వడం అసాధ్యమైన పని. ప్రణాళిక విభాగం వారు, వ్యవసాయశాఖ ఏఈవోలు ఇద్దరు ఒక పొలంలో 5 ఇంటు 5 మీటర్ల పరిధిలో పంటను కోసి ఎంత దిగుబడి వచ్చిందో అంచనా వేసి చెబుతారు. అదే తీరులో ఊరంతటిని పరిగణలోకి తీసుకుంటే అంతటా ఒకే రకమైన దిగుబడి రాదు. ఇలా చేయడం వల్ల ఒక ప్రాంతంలో పూర్తిగా కొట్టుకపోవచ్చు, వడగళ్లతో పంట రాలిపోవచ్చు. మరో ప్రాంతంలో రాకపోవచ్చు. అలాంటి సమయంలో ఒక పరిధిలో పంట కోత లెక్కిస్తే నష్టం తెలియదు. దీన్ని తొలగించి రైతులు సాగుచేసిన పంటను యూనిట్‌గా తీసుకుంటే మంచిదనే వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. రైతులు పంట సాగు చేసినప్పుడు బీమా సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకులు రుణం ఇచ్చినప్పుడు రెన్యూవల్ చేసినప్పుడు బలవంతంగా తీసుకోవడం లాంటివి చేయకూడదు. పంట నష్టపోయిన వెంటనే వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ, బీమా కంపెనీల ప్రతినిధులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి పంట పరిహారం, పంట కోసే సమయానికి వచ్చేట్లు చూడాల్సి అవసరం ఉంటుంది.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వర్ధన్నపేట రూరల్, మార్చి 15: మండలంలోని ల్యాబర్తి, కొత్తపెల్లి, నల్లబెల్లి, ఉప్పరపెల్లి గ్రామాలతో పాటు రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని వర్ధన్నపేట ఏడీఈ కన్నరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని, ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

సంత వేలం పాటలు వాయిదా

నెక్కొండ, మార్చి 15 : నెక్కొండ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే వారాంతపు సంత వేలం పాటలను ప్రత్యేక అధికారి తహసీల్దార్ రాజ్‌కుమార్ సమక్షంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం గొర్రెలు, మేకలు, తైబజారు రహదారి వేలం పాటలో నిర్ణీత ధర రాకపోవడంతో వేలం పాటలను అధికారులు వాయిదా వేశారు. ఈ నెల 19వ తేదీన తిరిగి సంత వేలం పాటలను నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి సదానందం తెలిపారు. ఈ వేలం పాటలో అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోతో ఎంపీపీ ప్రకాశ్‌రావు, అధికారులు

ఖానాపురం, మార్చి 15 : ఖానాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహించి, బదిలీపై ములుగు జిల్లా తాడ్వాయి ఎంపీడీవోగా వెళ్లిన సుమనవాణిని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో భాగంగా బదిలీలు సహజమని అన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సుమనవాణి మాట్లాడుతూ విధి నిర్వహణలో తన అనుభూతిని అధికారులు, ఉద్యోగులతో పంచుకున్నారు. అందరి సమష్టి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథకంలో నిలిపానని అన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీవోను ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో నూతన ఎంపీడీవో భారతి, ఎంపీవో రవి, వైస్‌ఎంపీపీ రామసహాయం ఉమాఉపేందర్ రెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మీకు ఒంటిపూట పట్టదా..!

• ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

• పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల నిర్వాకం

వర్ధన్నపేట రూరల్, మార్చి 15 : పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు ఒంటిపూట ఆదేశాలు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు దంచికొడుతుండడంతో ప్రభుత్వం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో శుక్రవారం నుంచి ఒంటి పూట బడులు నడపాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. కానీ, వర్ధన్నపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం అవేమి పట్టనట్లుగా యథావిధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలను నడిపించారు. ఇప్పటికే ఎండ వేడిమికి ప్రజలు బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం పిల్లల ఆరోగ్యం పై దృష్టి సారించి ఒంటిపూట బడులను నిర్వహించాలని తెలిపారు. కానీ, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు కూడా నిర్లక్ష్యం వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలీలు

నర్సంపేట, మార్చి 15 : రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ పట్టణానికి చెందిన పద్మశాలీలు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రజలకు స్వీట్లను పంపిణీ చేసి, అంబేద్కర్ సెంటర్ నుంచి వరంగల్ క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పెండెం శివానంద్, బాల్నే లింగం, అందె వెంకటేశ్వర్లు, రచ్చ శ్రీనివాస్, గాజుల రమేష్ బాల్నె సుభాష్, రవీందర్, టాక రాజు తదితరులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రి మండలిలో ఆమోదం తెలపడంతో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంక్షేమం కోసం గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దారం పూర్ణచందర్, పుల్లూరు భిక్షపతి, దారం రాము, సుబ్రహ్మణ్యం, దారం సోమనాథం, దొడ్డ రమేష్, ప్రసాద్, దారం కృష్ణమూర్తి, దారం సోమనాథం, ధర్మిని యాకాంబరం, సంతోష్, రవి,సత్యనారాయణ, లక్ష్మినారాయణ, ఈగ శ్రీను, దేశ్‌రాం పాల్గొన్నారు.

గీత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



సర్వాపురంలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

నర్సంపేట, మార్చి 15 : గౌడ కులస్తుల సంక్షేమం కోసం గీత కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సర్వాపురంలో శుక్రవారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 16 కులాలకు కార్పొరేషన్లు, సొసైటీలను ఏర్పాటు చేసిందన్నా రు. గౌడ సామాజిక వర్గం ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ముందుకు తీసుకెళ్లడానికి కార్పొరేషన్ ఏర్పాటువల్ల సాధ్యమ వుతుందన్నారు. గత ప్రభుత్వం గౌడ కులస్తులను మోసం చేసిన విధంగానే రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా హామీలను అమలు చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్వా యిపాపన్నగౌడ్ పేరు పెడతామన్న హామీ నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్రనాయకులు గంప రాజేశ్వర్, శీలం వీరన్న, మద్దెల సాంబయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జూలూరి హరిప్రసాద్, నాతిశోభన్ పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో స్కూల్ బస్సు డ్రైవర్‌కు జైలు శిక్ష

చెన్నారావుపేట, మార్చి 15 : మద్యం తాగి స్కూల్ బస్సు నడిపిన వ్యక్తికి నర్సంపేట కోర్టు రూ.500 జరిమానా, రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గూడ అరుణ్ శుక్ర వారం వెల్లడించారు. ఎస్సై కథనం ప్రకారం ఈ నెల 13న మండల కేంద్రంలో వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు డ్రం కన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న క్రమంలో స్కూల్ బస్సు నడుపు తున్న నల్లగుంట కుమారస్వామికి డ్రంకన్‌డ్రైవ్ పరీక్ష చేయ గా మద్యం తాగినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. కాగా, శుక్రవారం నర్సంపేట రెండోవ తరగతి మెజిస్ట్రేట్ ఎ.వెంకటేశం నిందితుడికి రూ. 500 జరిమానా విధించి, రెండు రోజులు జైలు శిక్ష వేసినట్లు ఎస్సై తెలిపారు. అదే విధంగా మరో ఐదుగురు వ్యక్తులకు డ్రంకన్ డ్రైవ్ కేసులో రూ.6వేలు జరిమానా విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

అన్ని రకాల సేవలు అందించాలి

రాయపర్తి, మార్చి 15 : అంగడి కేంద్రంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని రకాలను అందించాలని రాయపర్తి తహసీల్దార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో వారంతపు సంత అంగడి వేలాన్ని నిర్వహించగా నర్సంపేటకు చెందిన పాలకుర్తి ప్రభాకర్ రూ.4,03,000లకు వేలం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా నిత్యావసర వస్తువులతో పాటు ప్రజలకు కావాల్సిన మౌలిక, ఇతరత్రా అవసరాల సామగ్రిని అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు.

భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలి



రాయపర్తిలో వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయపర్తి, మార్చి 15 : విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేది ఇప్పుడేనని, ఆ దిశగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పాఠశాల హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు శ్రద్ధతో చదివితే ఆపై చదువుల్లో మంచిగా రాణించి ఉన్నత శిఖరాలకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సునిత, శర్మ, ప్రవీణ్‌రెడ్డి, దేవేందర్, ప్రభాకర్, స్వర్ణలత, రావుల భాస్కర్‌రావు, ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షల్లో భయాన్ని వీడి విజయానికి చేరువగా వెళ్లాలని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ వసుధ సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జయాపజయాలకు కుంగిపోకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ యువ జన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎర్ర విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి: మండలంలోని రంగాపురం ప్రభుత్వ హై స్కూల్‌లో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావే శాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రధానంగా టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షల భయంవీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాయాలని సూచిం చారు. విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదివి జీవితంలో గొప్పస్థానంలో నిలవాలని కోరారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలహాల్ టికెట్లను అందజేశారు. విద్యార్థులు గురువుల ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు వీర్, రవూఫ్, దామోదర్, శ్రీనివాస్, మహిపాల్,శోభన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామంలో ఆర్డీఎఫ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వారి తల్లి దండ్రులకు శుక్రవారం పాదపూజ చేశారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఆశీర్వదించి వారికి పదో తరగతి హాల్ టికెట్లను అందించారు. పాఠశాల కరస్పాండెంట్ అశోకాచారి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యా ర్థులు తల్లిదండ్రుల ఆశీర్వాదంతో, ఉపాధ్యాయుల సహకారంతో మంచి గ్రేడ్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉప ప్రధానోపాధ్యాయుడు మహేందర్, కో-ఆర్డినేటర్స్ అనీల్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట: విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల విద్యాలయంలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందించారు. ప్రతీ విద్యార్థి చదువుల్లో రాణించాలన్నారు. పరీక్షల్లో జీపీఏ 10/10ని సాధించేలా చదువును సాగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్, వల్లా వేణు, జక్కుల జగదీశ్వర్, దామెర గణేష్, వెంకటేశ్వర్లు, పైనాల రాజు, విష్ణు, బాలకృష్ణ, విజయ్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కార్పొరేషన్‌లో రుణాలను అందించాలి

చెన్నారావుపేట, మార్చి 15 : రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్ రుణాలను అందించాల ని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు తండరాజుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేసిందన్నారు. బీసీలను చిన్న చూపు చూసి చివరకు బీసీలకు అన్యాయం చేసిందన్నారు. బీసీ కులస్తులకు ప్రభుత్వం కుల వృత్తుల కార్పొరేషన్‌లో రుణాలను అందించాలన్నారు. చేతి వృత్తులందరికీ చేయూత నివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నర్సంపేట, మార్చి 15 : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతీ ఒక్కరు అవగాహనను పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ జయపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది వలంటీర్లు, విద్యార్థులకు శుక్ర వారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం వంటి విపత్కర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎలా రక్షించుకోవాలనే విషయాలపై అవగాహన అవసరమని అన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు రాజేశ్, అశోక్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్‌సిబ్బంది


పశువులకు గాలికుంటు టీకాలు

దుగ్గొండి, మార్చి 15: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు రాకుండా గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు దుగ్గొండి పశువైద్యాధికారి రాంమోహన్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం పశు వైద్యశిబిరం నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మామునూరి సుమన్, వెటర్నరీ అసిస్టెంట్ కవిత, పాల్గొన్నారు.

ఎండుగంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కరీమాబాద్, మార్చి 15 : ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసి, రూ.15లక్షల విలువైన 61కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుల వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ 14న ఎస్సై మునీరుల్లా శివనగర్ గేటు వైపు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు కొన్ని బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. బీహార్ రాష్ట్రం, వైశాలి జిల్లా, రాఘు వాహుర్ తానా, మల్లిక్‌పూర్ గ్రామానికి చెందిన మున్నాకుమార్, మిథున్‌కుమార్‌లు ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు కావడంతో పూణేలో వెల్డింగ్, కూలీపనులు చేసేవారని, ఆదాయం సరిపోకపోవడంతో, దురాశతో ఒరిస్సా, భువనేశ్వర్ వెళ్ళి గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయిని తక్కువ రేటుకు కిలో రూ.5వేల చొప్పున కొనుగోలు చేసి మహారాష్ట్రలోని సోలాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులకు ఎక్కువ ధరకు విక్రయించాలని పథకం వేసినట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఒరిస్సా భువనేశ్వర్‌లో కొనుగోలు చేసిన 61కిలోల ఎండు గంజాయిని పూణేకు తరలించేందుకు టిక్కెట్ తీసుకొని కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కినట్టు పేర్కొన్నారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే పోలీసులు రైలులో తనిఖీలు చేపట్టడం గమనించిన నిందితులు భయంతో వేరే మార్గం గుండా వెళ్దామని వరంగల్‌లో తమ వద్ద ఉన్న ఎండుగంజాయి బ్యాగులతో వరంగల్‌లో ట్రైన్ దిగి స్టేషన్ బయటకు వచ్చి ఆటో కొరకు ఎదురు చస్తుండగా అటువైపుగా పోలీసులకు చిక్కినట్టు సీఐ వెల్లడించారు.



WANTED
★ మా షాప్‌లో పనిచేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. Timings : 9.30 to 6 pm, జీతం : 6,500/- మరియు టెక్నికల్ బాయ్స్ కావలెను Timings : 12 pm to 10 pm, జీతం : 10,000 + అలవెన్స్. సంప్ర: 6309708800, 7093763375
AJW-177993

WANTED
★ ప్రముఖ బ్యూటీ పార్లర్‌లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన లేడీవర్కర్ కావలెను. ఉచిత వసతి + రూమ్ + భోజనం కలదు. సెల్ : 9951716914.
AJM-11602

WANTED HOSPITAL STAFF
★ GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ మరియు LAB టెక్నీషియన్స్ అనుభవంగలవారు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్. 12 to 2 pm.
AJW-0361

WANTED DRIVERS
★ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయడానికి DCM & బొలెరో డ్రైవర్స్ కావలెను. Phone Call Timings 11 am to 6 pm. Cell : 9396991649
AJW-5853

WANTED HELPERS
★ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయడానికి హెల్పర్స్ కావలెను. Salary : 14,000/-. Phone Call Timings 11 am to 6 pm. Only Boys. Cell : 9396991649
AJW-5854

WANTED
★ హనుమకొండలో మా సంస్థ నందు పనిచేయుటకు 3 వీలర్ ట్యాంక్ కలిగిన డ్రైవర్ + సప్లై బాయ్ కావలెను. సంప్ర: 9666717040, 9390562110
AJW-14210

కావలెను
★ A to Z బజార్ నందు సెక్యూరిటీగా పనిచేయుటకు అమ్మాయిలు, అబ్బాయిలు కావలెను. సంప్ర: A to Z Bazar, అదాలత్ సర్కిల్, HNK. Cell : 9059040017
AJW-14208

సెక్యూరిటీ గార్డ్సు వెంటనె కావలెను
★ WGL, HNK నందు గల Show Rooms, Hospitals నందు సెక్యూరిటీ గార్డ్సు వెంటనే కావలెను. మరియు మా ఆఫీస్ నందు ఆఫీస్ అసిస్టెంట్ వెంటనే కావలెను. జీతం : 10,000/- to 15,000/-. సం.ప్ర: 6309922608.
AJW-0365

కావలెను
★ ఇంట్లో పని చేయడానికి భార్యభర్తలు కావలెను. రూమ్ ఫ్రీ, జీతం (ఇద్దరికి కలిపి) 17,000/-. అడ్రస్ : యాదవనగర్ పెట్రోల్ పంప్, రెడ్డి కాలనీ, హన్మకొండ. సెల్ : 9581501234
AJW-177088

లోన్స్ ఇప్పించబడును.
★ వ్యాపార ఋణాలు (MSME) గృహ ఋణాలు, గృహ తనఖ ఋణాలు (NRI) (Commercial) నేషనల్ బ్యాంకుల ద్వారా మరియు ప్రైవేట్ బ్యాంకుల ద్వారా అన్ని రకాల లోన్స్ ఇప్పించబడును. సెల్ : 73823 33356, 97043 40702
AJK-185638

కపిలేశ్వర వాటర్ ప్రూఫింగ్
★ మీ బిల్డింగ్‌లోని బాత్‌రూమ్స్ మరియు స్లాబ్ సైడ్ గోడ, రూఫ్, ఓపెన్ టెర్రస్ వర్షాకాలపు లీకేజీలను అత్యాధునిక కెమికల్స్, ఇంజక్షన్ గ్రౌట్ టెక్నాలజీ ద్వారా 100% గ్యారంటీతో చేయబడును. Ph : 9059135404.
AJW-159722

CHANGE OF NAME
★ I, ADPA SRINIVASULU S/O. ADPA VENKAT (Old Name) H.No.2-10-288 To 291, F-Block, Flat No.202 GMR, Brindavan Apts, Waddepally, Hanumakonda Town & Dist-506370, T.S. have changed my name as ADAPA SRINIVASULU S/o. ADAPA VENKAT NARSAIAH (New Name) for all purposes.
AJW-5855

HOUSE FOR SALE
★ ఉర్సు గుట్ట నుండి కాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్ ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Independent Houses అమ్మకానికి కలవు. సంప్ర: 7660008666, 8309035091
AJW-27476

FLATS FOR SALE
★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సంప్ర: 7660008666, 8309035091
AJW-27475

HOUSE FOR SALE
★ ములుగు రోడ్ కాకతీయ కెనాల్ కన్నె ములగబపతి టెంపెల్‌కి దగ్గరలో G+1 తో గల గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న Independent House అమ్మకానికి కలదు. సెల్ : 7660008666, 8309035091
AJW-27477

HOUSE FOR SALE
★ హన్మకొండ, NGO's Colony లో గల 160 చ॥గుల 2 BHK, G+1 ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 8074106289, 9491941487
AJW-177980

FLAT FOR SALE
★ హన్మకొండ చైతన్యపురి కాలనీ NIT దగ్గర సిద్ధార్థ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో 2nd Floor East Face, 1504 Sft. Flat అమ్మబడును. సంప్ర॥ 9177999950
AJW-177987

FLATS FOR SALE
★ వరంగల్ 1st బ్యాంక్ కాలనీ (కొత్తవాడ) లో "3 LUXURIOUS & LAVISH 3-BHK FLATS" అమ్మకానికి కలవు (1st, 2nd & 5th Floor మాత్రమే - ఒక్కోటి 2500 SFT AREA). ఫ్లాట్స్ డెలివరీ: APR 2024. Cell : 9393538001
AJW-5848

HOUSE FOR SALE
★ వరంగల్ హంటర్ రోడ్, సంతోషిమాత గుడి లైన్‌లో 240 గజాలలో G+1 ఇల్లు అమ్మకానికి కలదు. ధర : 1.30 కోట్లు. నో బ్రోకర్స్. సంప్ర॥ 8106071999
AJW-14205

LAND FOR SALE
★ మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు దిశల్లో చౌరస్తా నుండి మరియు జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాల పక్కనుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పురా దాంబర్ రోడ్డు పై సైట్ ఫేసింగ్ 263, 228 అమ్మకానికి కలదు. సం.ప్ర: 9032111600
AJW-159756

KUDA PLOT FOR SALE
★ Oglapur Main Road అతి దగ్గరలో 100 ఫీట్ల రోడ్డు, 40 ఫీట్ల రోడ్ గల KUDA Plots కలవు. ధర 7,500/- నుండి 8,999/- వరకు. సంప్ర॥ సిరి - 6301613156
AJW-177991

FLAT FOR SALE
★ FLAT FOR SALE: HUNTER ROAD, WARANGAL 3BHK FLAT 1970 SFT. 2nd FLOOR, WITH WOOD WORK @ YATHIRAJA NILAYAM GENUINE PERSONS CALL : 9490022014/16
AJH-002288

RENTAL FOR SCHOOL BUILDING
★ Station Ghanpur (Mdl), Shivunipally (Vill) లోని Aditya Model School Building Rental కు ఇవ్వబడును. ఆసక్తిగలవారు స్వయంగా సంప్రదించగలరు. Cell : 9391180737, 8374650070, 8555909524
AJW-5852

CHANGE OF NAME
★ I, MOHAMMED FAROOQ (Old Name) H.No. 24-3-328, Basith Nagar, FCI Colony, Julywada, Hanumakonda City & Dist-506001, T.S. have changed my name as MOHAMMED FAROOQ AHMED (New Name) S/o. ATHEEK AHMED for all Purposes.
AJW-5855

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి